

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 12 సెప్టెంబర్, అక్టోబర్, 2015 సంచిక : 4, 5

సంస్థాపకులు :

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

ప్రధాన సంపాదకత్వం

శ్రీ మాతా శుకవాణి

భాషా ప్రవీణ, M.O.L.,M.A

ప్రత్యేక సహకారం

శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)

ప్రచార సారథ్యం

శ్రీ ఎం. సత్యనారాయణ M.Tech

సాయివాణి చందా వివరాలు

ద్వైవార్షిక చందా.......... రూ|| 160/-

ఆజీవ సభ్యత్వం .......... రూ|| 800/-

చిరునామా :-

సాయివాణి

C/o శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126.

Ph : 9440413455, 9848133565

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

విషయసూచిక పుట సంఖ్య

మా వాణి ........ 2

మహాభినిష్క్రమణం ........ 3

మాతృసంస్థ కబుర్లు ........ 27

షిరిడీ డైరీ ........ 31

హే పాండురంగ ........ 34

జ్ఞానధామం ........ 35

శ్రీ గజానన విజయం ........ 36

సంస్మరణిక ........ 39







## మా వాణి



"పడమటి సంద్రానికి తరలిపోయిన రవికిరణమా,
మా బ్రతుకులింక అంధకారమా?
విశ్వచేతనలో కరిగిన నీ తేజం
కనగలిగే కన్నులు మాకీయవా గురుదేవా!

మా కన్నీటి జడికి తడిసి చెరిగిపోయిన
నీ అడుగుజాడలు కనలేక, నడకరాక
తడుముకొంటూ తిరుగుతున్నాము స్వామీ!
మాకు దారి చూపరావేమీ!

'స్వచ్ఛత, ప్రేమ నా సాధన' అన్న మీరు
మమ్ము విడిచి ఎలా వెళ్లగలిగారు?
అంత కరుణ చిలికే వెన్నలాటి మనసుకు
ఇంత కరుకుదనం ఎలా అబ్బింది ప్రభూ!"

శూన్యంలో మీ చూపులు వెదుక్కొంటూ తిరిగే మేము ఏమని చెప్పగలం?

వానచినుకులు, గడ్డిపువ్వులు, నెమలి పింఛాలు, కుక్కపిల్లలు, ఆవు దూడలు - ప్రతిదానిలోనూ పరమాత్మను దర్శించగల మీరు -

గిరులలోని ఔన్నత్యం, ఝరులలోని చైతన్యం, తరువుల పరోపకార గుణం అన్నీ పరమాత్మ శక్తులేనని చెప్పే మీరు -

చివరికి పడగవిప్పి ఎదురునిలిచిన పాము కూడా చిరునవ్వుతో చూచి, 'వెళ్లిరా' అని మీరు అంటే తలవాల్చి వెళ్లింది గదా! అలాంటి ప్రేమమూర్తి మీరు -

ఇంకా ఏం చూడాలని వెళ్లారు గురువుగారూ! మమ్మల్ని-పాతికేళ్లుగా మీ కనుసన్నలలో, మీ ఆజ్ఞలకు లోనై, నిశ్చింతగా బ్రతికిన మమ్మల్ని - మా జన్మలు చరితార్థం చేస్తారన్న అంతులేని విశ్వాసంతో మీ చరణఛాయలో బ్రతికే మమ్మల్ని-ఇలా నడిసంద్రంలో విడిచివెళ్లిపోతే....ఈ వాణి ఏమని పలుకుతుంది? ఇలాగే నిశ్శబ్దమై, నిర్జీవమై పోదా గురుదేవా!



# మహాభినిష్క్రమణం



2015, ఏప్రిల్ చివరి వారం-27-ఆనాటి మధ్యాహ్నం - రెండు గంటల వేళ - గురుదేవులు భోజనం చేస్తున్నారు. అది వారు అలవాటుగా భోంచేసే సమయమే. నేను (శుకవాణి) వడ్డిస్తున్నాను. ఏదో ఆలోచిస్తున్నట్లుగానో, తమలో తామే అనుకొంటున్నట్లుగానో అన్నారు - "పాతికేళ్ళ గడిచిపోయాయి. సమాజసేవకై చెయ్యగలిగినంత ప్రయత్నం చేసాము. ఇక చాలుననిపిస్తోంది. ఇంక అంతర్ముఖత్వంవైపు నడవడమే". సరిగ్గా ఆ రోజు మేమందరం (నేను, ఆనందంగారు, రాము) గురుదేవుని వెంట ఆశ్రమప్రవేశం చేసిన రోజని గుర్తు వచ్చింది నాకు. "కడపటి క్షణం వరకు అవిశ్రాంతంగా పనిచెయ్యాల"ని బోధించిన మీరేనా యీ మాటలనేది!" అన్నాను ఆశ్చర్యంగా. "అలా అనిపిస్తోందిప్పుడు" అన్నారు నిర్లిప్తంగా. "వయస్సైపోయిందిగదా పాపం! అందుకే భావనలు కూడా ముసలివైపోతున్నాయి" అన్నాను నవ్వేస్తూ. వారు కూడా నవ్వేసారు. అదే వారంలో మరోసారి అలాంటి మాటలే అన్నారు. నాకు కొంచెం ఆశ్చర్యం, కాస్త భయం కూడా కలిగాయి - "ఏమిటీ వెనకడుగు!" అని.

మే నెల వచ్చింది. అనారోగ్యంతో నన్ను హాస్పిటల్‌లో చేర్చవలసి వచ్చింది. ఏడవ తేదీన నన్ను తీసుకొని వచ్చి ఆశ్రమంలో వదిలి, అందరూ సాయినాథ క్షేత్రంలో వార్షికోత్సవ నిర్వహణ నిమిత్తం తరలివెళ్లారు. మామూలుగా అయితే ఐదారు రోజులపాటు అక్కడి పనులన్నీ చూచుకొని, ఉత్సవం నిర్వహించి, ఆ రాత్రి ఆప్తులైన ఆశ్రమాభిమానులతో మంచి సత్సంగం జరిపి మరునాడు బయలుదేరి రావటం ఆనవాయితీగా వస్తోంది. కానీ, 12వ తేదీ మధ్యాహ్నానికి ఉత్సవం పూర్తికాగానే "ఇక బయల్దేరదాం. త్వర త్వరగా అన్నీ సర్దండి" అని పిల్లలందరినీ తొందరపెట్టారట గురుదేవులు.





గ్రామీణ భక్తులు "ఈ ఒక్కరాత్రికీ ఉండండి గురువుగారూ! మీతో మాట్లాడినట్లే లేదు మాకు" అని ఎంత బ్రతిమాలినా వినకుండా వ్యానులో కూర్చున్నారు. "గురువుగారెప్పడూ ఇలా మమ్మల్ని కాదని వెళ్లిపోరే! ఎందుకిలా తొందరపడుతున్నారో తెలియటం లేదు" అని నాకు ఫోన్ చేస్తే నేను కూడా అడిగాను గురువుగారిని ఫోన్‌లోనే. "బయలుదేరుతున్నానులే-అంతే!" అన్నారు. అది వారి తీరే కాదు. కొంచెం తెల్లబోయి ఊరుకున్నాము. రాత్రి తొమ్మిదింటికి సత్తెనపల్లి చేరుకున్నారు. "ఆపరా, రామూ! తెల్లవారుజామునే లేచి వెడదాం. దిగండి" అని అందరినీ సాయి సన్నిధానం దగ్గర దింపేసారు. "ఈపాటి దానికి అంత హడావుడిగా ఎందుకు వచ్చేసాం క్షేత్రం నుండీ?" రాముకు, పిల్లలకు అర్థం కాకపోయినా నిశ్శబ్దంగా దిగేసారు. రాత్రంతా దోమలగోల. తెల్లవారుజామున నాలుగింటికే లేచి మళ్లీ బయల్దేరి తొమ్మిదిన్నరకల్లా ఆశ్రమానికి వచ్చేసారు. సత్తెనపల్లి ఆశ్రమానికి కూడా కొంత శక్తి తమ సాన్నిధ్యంతో అనుగ్రహింపదలచి తొందరగా వచ్చి, అక్కడ ఆగారేమో!

మే నెలంతా తీవ్రమైన ఎండలు. గురుదేవులు ఎక్కువభాగం తమ గదిలోనే ఉంటూ వచ్చారు. అది మొదలు ఎక్కువగా ఆధ్యాత్మ గ్రంథాలే చదువుతూండటం, ఎక్కువభాగం మౌనంగా గడపడం, వేమనగారి పద్యం ఒకటి -

"ఎచటి నుండి వచ్చె ఎచటికి తాబోవు
నిదుర చంద మెరుగ నేర్చెనేని
సర్వముక్తుడగును సర్వమ్ము తానౌను
విశ్వదాభిరామ, వినురవేమ!" అన్నది నిరంతర స్మరణయింది.

"ఆకృతులు వేరైనా ఆత్మ ఒక్కటే" వంటి వాక్యాలు కొన్ని వ్రాసి గదిలో అంటించారు. "క్షణక్షణంగా కాలం గడచిపోతున్నది. ఈవేళ ఎంత సాధించావు?" అన్న ప్రశ్న కూడా అందులో ఒకటి.

జూన్‌లో పాపాయి పెళ్లి జరిగింది. వెంటనే నాకు గుండెపోటు

రావటంతో నేను కొద్దివారాలపాటు నా గదికే అంకితమైపోవలసి వచ్చింది. గురుదేవులు ప్రతిరోజూ వారి పీఠం మీది పూజాతీర్థాన్ని నాకు స్వయంగా యిచ్చి, ఆశీర్వదించేవారు-చిన్న, మెత్తని, ప్రేమమయమైన చిరునవ్వుతో. వారి ఆహారాదికాలన్నీ పెద్దపిల్లలే చూచేవారు. "గురుదేవులు చిక్కిపోతున్నారు-ఆహారం సరిగా తీసుకోవటం లేదు-ఆకలిగా లేదులే అంటున్నారు" అని వాళ్లు చెప్తే ఒకరోజు గురుదేవులను అడిగాను-'ఆరోగ్యం సరిగా లేదా?' అని. వారు నవ్వి 'సమాధిస్థితిలో ఎక్కువసేపు గడపాలంటే ఆహారం తగ్గాలిగదా!' అన్నారు. నేను మామూలు ఆరోగ్యంలోకి వచ్చాక హఠాత్తుగా 'మౌనం' అనే చీటీ ప్రత్యక్షమైంది వారి తలుపుమీద. మూడు రోజులు, రెండురోజులూ అలా అడపాదడపా మౌనదీక్షలో ఉండసాగారు. లేనప్పుడు కూడా మాట్లాడటం బాగా తగ్గించారు. ఏ పని గురించి అడిగినా "మీరు చూచుకోండి. నా మనసు వాటిమీదికి పోవటంలేదు. ఆశ్రమానికి నష్టం కలగనిరీతిలో, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఏ నిర్ణయమైనా మీరంతా కలిసి మాట్లాడుకొని తీసుకోండి" అంటున్నారు. వారు చెప్పటం, తాము చేయటంగా అలవాటైన కార్యకర్తలు కొంచెం యిబ్బందిపడుతున్నారు కూడా.

ఒకరోజు నేను ఆశ్రమానికి సంబంధించిన కొన్ని సమస్యలు వారితో చర్చించాలనుకొన్నాను. వారికి వినికిడి శక్తి బాగా తగ్గింది. గట్టిగా చెప్తే ప్రక్కన అందరికీ వినిపిస్తుంది. అంచేత విషయమంతా వివరంగా ఒక టావు కాగితానికి రెండువైపులా వ్రాసి వారికిచ్చి, మీ నిర్ణయం చెప్పండని చెప్పి వచ్చాను. ఒక అరగంట తరువాత, వారు బయటకు వచ్చారు. ఏం నిర్ణయాలు చెప్తారోనని నేను ఆత్రంగా దగ్గరకు వెళ్లాను. వారు నవ్వి "చక్కని ఇంగ్లీషు వ్రాసావురా!" అన్నారు. నాకు నవ్వూ, కోపం కలిసి వచ్చాయి. "ఈ అభినందన కోసమా నేను గజం పొడుగున వ్రాసింది?" అన్నాను. గురుదేవులు అదే ప్రసన్నతతో "ఒకసారి చెప్పాను గదరా-మీరే చూచుకోండి అన్నీ-అని. నాకు అంతర్ముఖత్వం తప్ప మరే ఆలోచనా





రావటం లేదు" అన్నారు. ఇంకేమనగలను!

మరో వారం గడిచింది. ఒకరోజు గురుదేవుల గదిలోకి తొంగి చూచాను. తమలో తామే నవ్వుకొంటున్నారు. చేతులు ఊపుతూ. నిశ్శబ్దంగా నిలబడ్డాను రెండు నిముషాలు. అదే ధోరణి-నా మనసులో ఏదో భయం, సందేహం కలిగాయి. సాయిబాబా రాత్రివేళ తమ ఎదురుగా ఎవరో ఉన్నట్లుగా రకరకాల అభినయాలతో మాట్లాడుతుండే వారన్నది గుర్తు వచ్చింది. గురువుగారు అలౌకికస్థితిలోకి వెళ్లిపోతున్నారా! ఆ చనువు, ఆ ప్రేమ, ఆ స్నేహం, ఆ బోధ, ఆ లాలన-అన్నీ మాకు దూరమై పోతాయా? కన్నీళ్లు వచ్చాయి. వెంటనే తేరుకున్నాను. వారంతటి మహత్తర దశకు చేరుకుంటే మొదట మేమే ఆనందించాలిగానీ బాధపడకూడదుగా!

మరో నాలుగు రోజులు గడిచాయి. గురుదేవుల చూపు మారినట్లని పిస్తున్నది. మనవైపే చూస్తున్నప్పటికీ-ఎక్కడో దూరతీరాలలో ఏదో చూస్తు న్నట్లు అనిపిస్తున్నది. రమణ మహర్షి అనంతాలలోకి చూస్తున్నట్లుండే వారని చదివినది గుర్తు వచ్చి గుండె ఝల్లుమన్నది. నవ్వులో ఏదో వైచిత్రి. జూలై 19వ తేదీ చాలామంది భక్తులు వస్తే అద్భుతమైన ప్రవచనం చేసారు. అరగంటసేపు-బాగా అలసిపోయారు సాయంత్రానికి. అయినాగానీ రామకృష్ణ కథామృతం చదువుతూ ప్రొద్దుపోయేదాకా గడిపారు. 20వ తేదీ సాయంత్రం ఆశ్రమ బాలికలను కూర్చోబెట్టి మోకాళ్లనొప్పులకు ఎప్పుడూ తాము తయారుచేయించే మందు తయారుచేయించారు. "పాళ్లు జాగ్రత్తగా గమనించారు గదా! వ్రాసిపెట్టుకోండి. ఇక మీదట మీరే సొంతంగా చేయాలి" అని చెప్పారు. మరునాడు 21వ తేదీ ఉదయం ఆశ్రమంలోని హాస్పిటల్, సంధ్య (వృద్ధాశ్రమం), చెరువు అంతా తిరిగి వచ్చారు. తోటలోకి వెళ్లి "నిమ్మకాయలన్నీ పండి రాలిపోయి ఉన్నాయి' అని ఉత్తరీయపు కొంగులో ఓ యాభై కాయలు మోసుకువచ్చారు. "ఏమిటి గురువుగారూ, అలా ముళ్లలోంచీ, రాళ్లలోంచీ నడుస్తున్నారు. ఆ కాలి

వేలికి ఏదైనా తగిలితే ఎంత బాధ చెప్పండి. అసలే గాయం ఉంది గదా!" అంటే "ఫర్వాలేదులేమ్మా! మొన్న పెట్టిన మామిడిమొక్కలు ఎలా ఉన్నాయో చూద్దామని వెళ్లాను" అన్నారు.

మళ్లీ డాబా మీదికి వెళ్లారు. మా నేరేడు చెట్టు చాలా ఎత్తు పెరిగింది. డాబా మీది నుండీ ఆ నేరేడు పళ్లన్నీ కోసి, పిల్లలను బక్కెట్లు తెమ్మని రెండు బక్కెట్ల నిండా నింపి తెచ్చారు. ఇక సాయంత్రం వరకూ వచ్చిపోయే భక్తులందరికీ దోసిళ్లతో పంచారు. ఇవేవీ ఆయన మామూలుగా చేసే పనులు కావు. శరీరం శుష్కించింది. ముఖంలో ముఖ్యంగా కండ్లలో ఏదో ఒక అద్భుత ప్రకాశం. అది సౌందర్యం కాదు-ఒకానొక అలౌకిక దీప్తి.

జూలై 22వ తేదీన ఉదయాన్నే అనుష్ఠానం అయిపోయాక, వచ్చి వరండాలో కూర్చున్నారు. అల్పాహారం చేసి, పాలు తీసుకున్నారు. తొమ్మిదైంది. 'ఎం.వి.ఆర్.శాస్త్రిగారు వస్తారన్నావుగా-ఎన్నింటికి?' అని అడిగి పదిన్నర తరువాత వస్తానన్నారంటే-కళ్లు మూసుకొని ధ్యానంలో ఉండిపోయారు. నాకు క్లాసు వచ్చింది. రెండు పీరియళ్లు అయ్యాక పదకొండు దాటాక నేనూ ఫ్రీ అయ్యాను. శాస్త్రిగారు, వారి యిల్లాలు కూడా వచ్చారు. దాదాపు మధ్యాహ్నం రెండుదాటే వరకు ఉన్నారు. అందరూ కలిసి ప్రస్తుత భారతభూమిలో హిందువుల పరిస్థితిని గూర్చి, విదేశీ శక్తులు భారత యువతను ఆకర్షించడానికై పన్నుతున్న యుక్తులను గూర్చి, గడప గడపకూ హైందవ ధర్మప్రచారం జరగవలసిన ఆవశ్యకతను గూర్చి, ప్రతి మనిషీ ఒక కేంద్రబిందువై యీ ప్రచారం చేయవలసిన రీతిని గూర్చి విపులంగా మాట్లాడుకున్నారు. ఒక ప్రణాళికారచన కూడా జరిగింది. ఆ తరువాత శాస్త్రిగారి దంపతులు తమ యింటికి బంధువులెవరో వస్తారని వెళ్లిపోయారు. గురువుగారు వారికి ఆవు జున్ను పెట్టించి మరీ పంపారు.

అంతలో చైత్రలక్ష్మి వచ్చింది. గురువుగారికి తానే భోజనం పెడతానని గదిలోకి పరిగెత్తింది. 'ఈ కూర బాగుంది, ఇంకొంచెం వేసుకోండి, మరీ





రెండు స్పూనుల అన్నం అయితే ఎలా సరిపోతుంది? ఇదుగో ప్రసాదం కొద్దిగా తీసుకోండి' ఇలా బ్రతిమాలీ, బామాలీ ఏదో కాస్త తినిపించింది. తరువాత గురుదేవులు విశ్రాంతిగా పడుకొన్నారు. మూడున్నరకు సిద్ధిపేట నుంచీ ఎవరో భక్తుడు వచ్చారు. ఐదింటివరకు ఉండి "కాస్త ఆ గది తలుపు తెరిస్తే గురుదేవుల ముఖదర్శనమైనా చేసుకొని వెడతాను. లేకపోతే నాకు బాధగా ఉంటుంది' అని. ఒకటే అడుగుతోంటే-మెల్లగా తలుపునెట్టి చూచాము. పడుకొన్నవారు కళ్లు తెరిచి 'ఎవరు?' అన్నారు. ఈ భక్తుడు నమస్కారం చేసి, తన గురించి చెప్పకొంటే విని 'శుభమస్తు! గుడికి వెళ్లి నమస్కారం చేసుకొని వెళ్లు బాబూ!" అని మళ్లీ పడుకొన్నారు. అతను వెళ్లిపోయాడు.

రాత్రి ఏడుగంటలవేళ గీత వచ్చి "గురువుగారు మధ్యాహ్నమూ కొద్దిగా తిన్నారు. ఇప్పుడూ ఏమీ తిననంటున్నారు. మీరోసారి చూడండి" అన్నది. గదిలోకి వెళ్లాను. రాము, చంద్రన్న అక్కడే ఉన్నారు. రాము ఆల్మండ్ ఆయిల్ రాసి, మర్దన చేస్తున్నాడు తలకు. "నొప్పాండీ?" అని అడిగితే, 'వేడి' అన్నాడు రాము. కాస్సేపు ఆ మాటా యీ మాటా చెప్పి, రెండు జోక్‌లు చెప్పి గురుదేవులను నవ్వించాము. దాదాపు ఎనిమిదయ్యాక రాము మళ్లీ వస్తానని బయటికి వెళ్లాడు. 'ఏం తీసుకుంటారు గురువుగారూ యీ పూట?" అని అడిగాను. "కొంచెం కడుపుబ్బరంగా ఉందమ్మాయీ! ఏమీ వద్దు' అన్నారు. నాకు హఠాత్తుగా గుర్తు వచ్చింది-మొన్న అంటే ఓ వారం రోజుల క్రితం సత్తెనపల్లి నుండి ఒక పుచ్చకాయ వచ్చిందని. అక్కడి ఆశ్రమంలో ఒకే పుచ్చమొక్క వచ్చిందనీ, దానికి ఒకే కాయ కాసిందనీ పంపించాడు ప్రేమ్‌కుమార్. అది తెప్పించి సగానికి కోసి, గుజ్జు చిదిపి, రసం చేసి, గ్లాసు సగం యిచ్చాను గురుదేవులకు. "అమ్మో, యింతా!" అన్నారు. "అది తాగితే త్రేన్పులు వస్తాయి. కడుపుబ్బరం తగ్గుతుంది" అంటే సగం త్రాగి యిక చాలన్నారు. మొత్తం తాగాల్సిందేననీ, లేకపోతే చైత్రను

పిలుస్తామనీ డబాయించాం. "అమ్మో! ఆ పని చేయకండి. నన్ను పీకి పాకం పెడుతుంది" అని నవ్వుతూ తాగేసారు మొత్తం. అటుపైన ఓ చిన్న జామముక్క గింజలన్నీ తీసేసి యిస్తే తిని 'యిక చాలు- ఇంకేమీ పెట్టకండి' అన్నారు. చివరిసారిగా నా చేత్తో పెట్టనోచుకున్నది అవే.

అంతలో రాము తిరిగి వచ్చాడు. అతను శ్రీ సాయి సచ్చరిత్ర (హేమాడ్పంత్ రచన) పారాయణ చేస్తున్నాడు ఆ వారం. ఆ రోజు 44వ అధ్యాయం చదివానంటూ అందులో నామరూపాలు తొలగించి కేవలం శక్తినే చూడాలని బాబా చేసిన బోధను గూర్చి చెప్పాడు. దాని వివరణ కోరాడు. గురుదేవులు నవ్వుతూ జీరువాకు అంటించిన కాగితం వైపు చూపించారు. "ఆకృతులు వేరైనా ఆత్మ ఒక్కటే' 'నీవు నన్ను వెదకడానికి ఎక్కడికీ పోనక్కరలేదు-సర్వజీవులలో నేను ఉన్నాను" అన్నవి చదివాము. 'అదే-ఎలాగ?' అన్నాడు రాము. గురుదేవులు సూటిగా, స్పష్టంగా, సరళంగా వివరించారు.

"ప్రతి జీవికీ ఒక రూపం, ఒక పేరు ఉంటాయి. చీమ అనగానే మనకు దాని రూపం గుర్తు వస్తుంది. దాన్ని చూడగానే 'చీమ' అన్న పేరు తడుతుంది. కానీ, యీ రెండింటినీ మించిన శక్తి ఒకటి దానిలో ఉన్నది. చీమ మొదలు బ్రహ్మం వరకు ప్రతి వస్తువులోనూ ఉన్న ఆ శక్తే ప్రత్యగాత్మ-పరమాత్మ. నీలో, నాలో, అతనిలో....... ప్రతీజీవిలోనూ మనం ఆ శక్తినే చూడగలిగిననాడు-అంటే అంతటా, అందరిలో అంతర్లీనంగా ఉన్న ఆత్మనే చూడగలిగిననాడు యిక భేదభావం ఎక్కడుంటుంది? ఎవరిని ద్వేషించగలవు? ఎవరిపై కోపించగలవు? ఎవరిని హింసించగలవు? ఎవరిపై అసూయపడగలవు? అవేమీ లేకపోతే నీ మనసులో మిగిలేది ఏమిటి?-ప్రేమ. అదుగో ఆ ప్రేమే-ప్రపంచం అంతటినీ కలిపి ఉంచగల సూత్రం. సర్వజీవులలోనూ నీవే ఉన్నావు. అలాంటప్పుడు నిన్ను నీవు ప్రేమించుకోవూ? ప్రేమ వేరు, మమకారం వేరు. విశ్వమంతటిలోనూ ఒకే





ఆత్మను చూడగలవాడికి ఎవరో కొందరి పట్లనే మమకారం నిలవదు. అప్రయత్నంగానే స్వచ్ఛమనస్కుడిగా మారిపోతాడు.

స్వచ్ఛత, ప్రేమ-యివే ప్రపంచంలోని జీవులన్నిటినీ నీకు దగ్గర చేస్తాయి. ప్రేమలో కపటం, భేషజం, హద్దులు గీసుకొనే నైజం ఉండకూడదు. అప్పుడే అది స్వచ్ఛమవుతుంది. అటువంటి ప్రేమను పెంచుకోండి. ప్రేమతో అందరినీ దగ్గరకు తీసుకోండి. అదేమనను భగవంతునికి దగ్గర చేస్తుంది". వారు చెప్పిన దాని మీద మరో సందేహం-దానికి సమాధానం-అలాఅలా పదిన్నరైంది. గురుదేవులకు నమస్కారం చేసి రాము, నేను బయటకు వచ్చాము. చంద్రం గురువుగారి దగ్గరే పడుకొంటున్నాడు దాదాపు రెండునెలలుగా. ఎవరిచోట్లలో వాళ్లం నిద్రకుపక్రమించాం.

ఉదయం ఐదు గంటలు దాటింది. చంద్రారెడ్డి నా గది తలుపు తట్టాడు. గభాల్న తలుపు తీసాను. "కొంచెం మంచినీళ్లు కావాలక్కయ్యా! గురువుగారికి కాస్త ఆయాసంగా ఉందంటున్నారు-అన్నాడు. గబగబ పరుగులు పెట్టాము. కుర్చీలో కూర్చుని ఉన్నారు. ఆయాసపడుతున్నారు. శ్వాస అందటం లేదా? నన్ను చూడగానే "బొట్టు పెట్టమ్మాయీ!" అన్నారు. వెంటనే సాయివిభూతి కొంచెం నాలుకపైన వేసి బొట్టు పెట్టాను. తలపైన చిరుచెమటలు అలుముకొంటున్నాయి. "నొప్పి ఉందాండీ!" గుండెవైపు చూపిస్తూ అడిగితే తల అడ్డంగా ఊపారు. కానీ టోనీకార్డ్ వెయ్యమన్నారని చంద్రం తెచ్చాడు. నీళ్లు కలిపి యిచ్చాము. రాము కోసం పిల్లలు పరిగెత్తారు. ఐదుంబావుకల్లా రాము కారు తీశాడు. కిమ్స్‌కు వెడదాం అన్నాడు. గురువుగారికి హాస్పిటళ్లంటే పడదు. మేము బ్రతిమాలో, బామాలో చివరికి బలవంతంగానో తీసుకువెళ్లవలసిందే. ఐదారు రోజుల క్రితం కాలికి ఉన్న చిన్నగాయం ఓసారి చూపిద్దామని ప్రయత్నించినప్పుడు కూడా గురుదేవులు ఒప్పకోలేదు. "శరీరం జీర్ణమైపోతోందిరా! ఇక నాకు డాక్టర్లతోనూ, ఆసుపత్రులతోనూ పనిలేదులే!" అన్నారు. అలాంటిదీరోజు

తమంతట తామే గబగబ వెళ్లి కారులో కూర్చున్నారు. వెనక సీట్లో నేను. డ్రైవింగ్ రాము. ఆలస్యమవుతోందని ఎవ్వరికోసమూ ఆగకుండా వెనక స్కూటర్ల మీద రమ్మని చెప్పి మేము వెళ్లిపోయాము. సాయినామం చెప్తున్నారు గురువుగారు కూడా. వారి తల్లోంచీ మెడ మీదుగా చెమటలు ధారగా ... నాకు వణుకు వస్తోంది. గురుదేవుల భుజాల మీద చేయి వేసి "గురువుగారూ బాగా బాధగా ఉందా?" అని అడిగాను. జవాబివ్వలేదు. రాము "అమ్మా, నా చేతులు వణుకుతున్నాయి" అన్నాడు. "నామం ఆపకు-పోనివ్వు. ముందు విజయా హాస్పిటల్ దగ్గర ఆపు-ఫస్ట్ ఎయిడ్ దొరుకుతుంది గదా!" అన్నాను. హాస్పిటల్ గేట్‌లోకి తిరిగాము ....................

బుద్ధెరిగిన అరవై అయిదేళ్లుగా (పన్నెండేళ్ల వయసు నుండీ) ఆత్మ విచారణతో ప్రేమ, సహనం అలవరచుకొనే సాధనలోనే తరించిన ఆ శిరస్సు, తమ కరుణాపూర్ణమైన దృష్టితోనే ఎందరి మండుతున్న గుండెలో చల్లార్చిన ఆ ప్రేమమూర్తి శిరస్సు, తమ చిరునవ్వు వెన్నెలతోనే ఎందరి జీవితాల్లోనో ఆవరించిన చీకట్లు పోకార్చిన ఆ సౌజన్యమూర్తి శిరస్సు వాలిపోయింది. వెంటనే వారి మాడు మీద అరచేతి మందాన ఎర్రగా మారింది-అదీ కెంపు వన్నెగా! స్వామీ ................! మాట నిలుపుకున్నారురా, కడపటి క్షణంలో కూడా. డాక్టర్లతో పనిలేదన్నట్లే అయింది. ఆ డాక్టర్లు, వారి పరికరాలు "నో మోర్" అని చెప్పడానికే పనికి వచ్చాయి.

మా గోడు విని ఒకటికి మూడుసార్లు ఇ.సి.జి ప్రయత్నించారు. ముందే ఆక్సిజన్ పనిచేయలేదు. "గురుదేవులింక లేరమ్మా!" అంటూ కుప్పకూలి పోయాడు రాము. "నాన్సెన్స్! గురువుగారు లేకపోవటం ఏమిటిరా!" నేను కాళ్లు, చేతులు తాకి చూచాను. వేడిగా ఉన్నాయి. డాక్టర్‌వైపు చూచాను. "హార్ట్ ఎటాక్" అన్నాడు. ఇంకాస్సేపు వేడి ఉంటుందన్నాడు. తమ వలన ఏమీ కాదన్నాడు.

నాకు కాళ్లు వణికాయి. ప్రక్కన కుర్చీలో కూలబడ్డాను. రాము





చటుక్కున తేరుకొన్నాడు. ఒక నర్స్‌ను పిలిచి "మా అమ్మకు మొన్ననే స్ట్రోక్ వచ్చింది. కొంచెం ఆమెను చూడండి" అంటున్నాడు. ఆమె నాకు కొంచెం గ్లూకోజ్ నీళ్లు తెచ్చిచ్చింది. నాకు ఏడుపు రావటంలేదు. స్తబ్ధంగా ఉంది మెదడు. గురువుగారు లేరా?-అదేం వాక్యం! కోపం వస్తోంది. అప్పటికింకా పూర్తిగా తెల్లవారనే లేదు. ఎవరికని చెప్పకోము యీ కబురు! నోరెలా వస్తుంది ఆ మాట పలకడానికి! మూడు పదులు నిండీ నిండని, ఆశ్రమం తప్ప మరో లోకం తెలియని రాము తన దుఃఖాన్ని అణిచిపెట్టి, కార్యరంగంలోకి దిగాడు. "అమ్మా! మీరు ధైర్యంగా ఉండండి. మీరు కూడా లేకపోతే నా గతేమిటి?" అంటూ పొంగి వచ్చే దుఃఖాన్ని ఆపుకొని నా కళ్లు తుడిచాడు.

ఆరయింది అప్పటికి. అతి ముఖ్యులైన ఐదారుగురికి, ఆశ్రమానికి ఫోన్లు చేసాడు. అటుపైన పదినిముషాలకు ఆశ్రమవాసులు కొందరు వచ్చారు. అంబులెన్స్ కూడా సిద్ధమైంది. ఇందాక నడుస్తూ కారెక్కిన గురుదేవులను స్ట్రెచర్ మీద అంబులెన్స్‌లోకి చేర్చారిప్పుడు. అతి ప్రశాంతంగా నిద్రపోతున్నట్లున్న ఆ ముఖంవైపు చూస్తోంటే "ఇక లేవండి తెల్లవారింది" అనాలనిపిస్తున్నది. వారు సజీవులుగానే కన్పిస్తున్నారు. మేమే జీవచ్ఛవాల్లా కదిలాము. సాయిధామం ఆశ్రమంలోని దేవాలయాలు మూతపడ్డాయి. గేటుదాటి లోపలికి వెడుతోంటే అంతా స్మశాన నిశ్శబ్దం. ఉష దగ్గరకు వెళ్లేటప్పటికి నిశ్చేష్టులై ప్రతిమల్లా నిబడి ఉన్న పిల్లలు, వృద్ధులు.....

గురుదేవులు వరండాలోని మంచంపై నిరుద్వేగంగా, నిర్లిప్తంగా, ఏ మాత్రం బాధలేని ముఖంతో శయనించారు. కబురు తెలిసి పరుగు పరుగున వచ్చిన మేస్త్రీ ముత్యాలు తొలి పుష్పమాల సమర్పించుకొని ధన్యుడయ్యాడు. ప్రతి గురువారం సాయిబాబాకు నిలువెత్తు పూలమాల తెచ్చే కీనర శివారెడ్డి అలవాటుగా తెచ్చిన మాలతో గురువుగారిని అలంకరించాడు.

ఎం.వి.ఆర్.శాస్త్రి గారికి కబురు తెలియగానే నిర్ఘాంతపోయి "అయ్యో, అదేమిటి, నిన్ననేగా అంతసేపు మాట్లాడారు? నేను వస్తున్నానం"టూ వచ్చేసారు. ఈ లోపల పరిసర గ్రామాల నుండీ జనం రాసాగారు. నాలుగు టీ.వీ.ఛానెళ్లలో స్క్రోలింగ్స్ మొదలైనాయనీ, రేడియో ప్రాంతీయ వార్తల్లో కూడా యీ వార్త వినిపించారనీ ఊళ్ల నుంచీ ఫోన్‌లు వస్తున్నాయి-నిజమేనా అని తెలుసుకోవడానికి. బహుశః శాస్త్రిగారు యీ ఏర్పాట్లన్నిటికీ పూనుకొని ఉంటారు. ఒక గంట గడిచేప్పటికే గురుదేవులు పుష్పహారాల గుట్టలో మునిగిపోయారు. వారికి ఎవ్వరు పూలమాల వెయ్యబోయినా యిష్టపడేవారు కారు. బాబాకు వెయ్యమనే వారు. బలవంతంగా వేసినా రెండు నిముషాలుంచి తీసేసేవారు. అలాంటిది ఎన్ని మోస్తున్నారు గురువుగారూ! ... ఫ్రీజర్ వచ్చింది. వాడు 'దండలన్నీ తీసెయ్యాలి' అన్నాడు. మళ్లీ తమ నిరాడంబరరూపంతో ఫ్రీజర్‌లోకి ప్రవేశించారు గురుదేవులు.

ఎవరెవరో వస్తున్నారు. ప్రదక్షిణలు చేస్తున్నారు-ఏడుస్తున్నారు. ఎలా జరిగిందో ఎంక్వైరీ చేస్తున్నారు. విషాదం-విషాదం-విషాదం. తొంభై నిండ డానికి దగ్గరపడుతున్న మాధవరావుగారు (ప్రశాంతిలో ఉంటారు) గురుదేవులతో పోట్లాడసాగారు ఇంగ్లీషులో. "చెప్పాను గదా-ముందు నేను వెళ్లాలి-మీరు తొందరపడకండి అని. నవ్వేరు కూడా. ఏమంత తొందర వచ్చిందని వెళ్లిపోయారు? నేను మిమ్మల్ని గుర్తించటం కాస్త ఆలస్యమైంది. అంతలోకే .." పాతికేళ్లుగా ఆశ్రమాలలో జీవిస్తూ, తమ పిల్లలెక్కడున్నారో కూడా తెలుసుకోని అచ్చమైన వానప్రస్థుడైన ఆ వృద్ధుడి ఘోష వింటూ గురుదేవుల ఆత్మ ఏమనుకొంటుంటుంది? ఏ ఒక్కరి హృదయం నొచ్చు కున్నా తామే నొచ్చుకొనే సహానుభూతిపరులైన ఆ స్వామి ఏమీ పట్టనట్లు ఎలా ఉంటున్నారు? ఏ ఒక్క భక్తుడు తమ కోసం వచ్చినాగానీ తింటున్న టిఫిన్ అలా వదిలేసి వచ్చేస్తారే-వందలాదిమంది వచ్చి నిలబడి ఉంటే ఎంత నిరుద్వేగంగా పడుకొన్నారు! నాకు గుండెలలో మంటగా ఉంది.





అయోమయంగా ఉంది. తోలుబొమ్మలాటేదో చూస్తున్నట్లుంది. నిరామయంగా, శోషిల్లినట్లుంది.

సాయంత్రానికి వెయ్యిమందికి పైగా అభిమానులు, శిష్యులు దర్శించు కున్నారు గురుదేవులను. విశాఖపట్టణం, బెంగుళూరు, ఖమ్మం, గుంటూరు, తెనాలి, రేపల్లె, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి .... ఎక్కడెక్కడి నుంచో రైళ్లు, కార్లు, విమానాలు-ఏది దొరికితే అది పట్టుకొని వచ్చేసారు. రాత్రి అయింది. ఎవరో నన్ను లేచి కాస్సేపు నడుం వాల్చమంటున్నారు. 'ప్రొద్దుటి నుంచీ అలా కూర్చొనే ఉన్నారు' అని సానుభూతి చూపిస్తున్నారు. నా జబ్బు గుర్తు చేస్తున్నారు. నాకు కోపం వస్తోంది. ఎవరు వీళ్లంతా? నా తండ్రి, నా గురువు, నా మిత్రుడు, నా ఆప్తుడు, నా కొడుకు దగ్గర్నుంచీ నన్ను వెళ్లిపొమ్మంటారు! ఆ ముఖం మళ్లీ నాకు కన్పిస్తుందా? పువ్వులోని తేనె కోసం వెదికే చీమను నేను-పువ్వుతో సహా నన్ను శివుని తలకెక్కించిన స్వామిని విడిచి విశ్రాంతి తీసుకోవాలా! శర్మగారి శారద-నాలుగురకాల రోగాలతో అల్లాడుతున్న శారద నా వీపు మీది నుంచీ చెయ్యి తియ్యకుండా తోడుగా కూర్చున్నది. సాయిమాల, జయ, కవిత, పద్మ, పద్మజ, విజయలక్ష్మి..... తెల్లవార్లూ భజనలు చేసారు కీసర భక్తబృందం. హోంసిక్ హాలిడేస్‌కు వచ్చి తిరిగి కాలేజ్ హాస్టళ్లకు గుంటూరు వెళ్లిపోయిన సుధ, భారతి మళ్లీ వచ్చేసారు. గోడుగోడున ఏడుస్తూనే భజనలు చెప్తున్నారు. రోజులు పసిగుడ్డుల్లా గురుదేవుల ఒడిలోకి చేరి, ఆ చల్లని లాలనలో పెరిగిన అమ్మలు, చైత్ర, సుధీర ఒకళ్లనొకళ్లు చూచుకొంటూ ఏడుస్తున్నారు. మగపిల్లలందరూ సాయినామం, భజనలు చెప్తుంటే-మంజుల గురుదేవులకెంతో ప్రియమైన దేశభక్తి గేయాలు పాడింది. మధ్య మధ్య ఎవరైనా వచ్చినపుడు నాలుగైదు నిముషాలు తప్ప అవిచ్ఛిన్నంగా సాగింది భజన, సంకీర్తన. సాయి విద్యాధామం పూర్వవిద్యార్థి చి॥హేమంతరెడ్డి తాను యుద్ధ ప్రాతిపదికన వ్రాయించిన ఫ్లెక్సీలు,

గురుదేవుల బొమ్మలు ఇ.సి.ఐ.ఎల్ నుండీ ఆశ్రమం దాకా పెట్టించాడు. నా విద్యార్థి పి.వి.శ్రీనివాస్, స్మిత వచ్చారు. నా ప్రక్కనే నిలబడ్డారు.

తెల్లవారింది. మళ్లీ జనం రాసాగారు. ఇక-ఇవ్వేళ గురుదేవుల భౌతిక శరీరం కూడా కనుమరుగవుతుంది. ఎనిమిదింటికల్లా ఖనన క్రియా కలాపం నిమిత్తం శ్రీ శేషాద్రిశర్మగారు, చి॥ మాధవశర్మ (గురుదేవుల పట్ల అభిమానం పెంచుకున్న ఆశ్రమ పూర్వవిద్యార్థి) వచ్చారు. గతంలో ఒకసారి గురుదేవులు తమ సమాధి కోసం చూపించిన స్థలంలో నేల తవ్వసాగారు. ఎవరో పిల్లలు పరుగెత్తుకొంటూ వచ్చారు-"అమ్మా, అమ్మా! రెండు మూతుల పాము వచ్చిపడింది గోతిలో" అని చెప్పారు. అది రెండు వైపులా తలలుండి ఎటయినా నడుస్తుంది. తోక ఉండదు.

ఎన్నడో పాతికేళ్ల క్రితం ఆశ్రమం ప్రారంభించడానికి తొలి గుడిసె వెయ్యడానికై తవ్వుతున్నపుడు వచ్చింది అలాటి పాము. దాన్ని చంపగూడదనీ, అది ఉన్న చోటు చాలా ప్రసిద్ధమవుతుందనీ, బాగా కలిసి వస్తుందనీ, ధాన్యపుగాదెల్లో వేస్తే అక్షయంగా ధాన్యం ఉంటుందనీ, అది పూర్తిగా విష రహితం అనీ పనిచేసేవారు చెప్పారు. నమస్కారం పెట్టి వదిలేసారు. మళ్లీ యిన్నేళ్లలో పెద్ద బావి, రెండు చెరువులు, ఇన్ని భవనాలకోసం పునాదులు-ఎన్నో త్రవ్వించాంగానీ ఎక్కడా అలాటి పాము పొలకువ లేదు. ఇప్పడు మళ్లీ వచ్చిందా యీ జ్ఞానధామంలోకి! ఈ తావు మహత్తర శక్తిమంత మవుతుంది కాబోలు! అప్రయత్నంగా మనసులో స్ఫురించిన పేరు 'జ్ఞానధామమే' ఆ చోటుకు సరైన పేరు. గురుదేవులది జ్ఞానమార్గమే-అనుకొన్నాను.

ఫ్రీజరు తెరిచారు. గురుదేవులను 'ఉష' భవనం ముందరవేసిన షామియానా క్రింద కుర్చీలో కూర్చుండబెట్టారు. కర్మ కలాపం జరపడానికి గురుదేవులు పాతికేళ్లక్రితం కోరి అక్కున చేర్చుకొని, బ్రహ్మచర్య దీక్షనిచ్చి, శిక్షణనిస్తూ వచ్చిన చి॥ రాంబాబు (రాము)ను పిలిచారు పురోహితులు.





ఏవో మంత్రాలు-ఏవో క్రియలు-నాకు వేటి మీదా మనసు నిలవటం లేదు. మరికొద్ది గంటలలో ఆ తనువు మరి కన్పించదు- అదొక్కటే సుడులు తిరిగే బాధ.

కీసరగుట్ట మీది సరోజనమ్మగారన్నట్లు పోయేది మాయబొమ్మే గదా-ఆత్మజ్యోతి శాశ్వతమేగా! అది బుద్ధికి తెలుసు. కానీ అనుభూతికి రావటం లేదు. అద్భుతమైన పుష్పపరిమళం గాలిలో తేలివస్తే సంతోషమే. ఆ పూల మొక్కకే పువ్వులు చూస్తూ పరిమళం ఆస్వాదించటం మరింత ఆనందం కాదూ-గోపికలు అన్నట్లుగా! అలా చూస్తూనే కూర్చున్నాను. కొంతసేపటి తరువాత గురుదేవులకు గంగా, గోదావరి, కృష్ణ, మానససరోవరాది తీర్థాల నీటితో స్నానం చేయించారు. మరొక్క వారంలో గురుపూర్ణిమ రానున్నది. ఆరోజు శిరస్సున నూనెపెట్టి, అభ్యంగన స్నానం చేయించటం ఆనందం, చంద్రం, రాములకు, మాకు ఎంతో వేడుకైన సేవ. వారం రోజులు ముందుగానే యిలా చేయించుకొంటున్నారా గురుదేవా! ..... పొరపాటున వానచినుకు తలమీద పడితే వెంటనే 'రుస్‌టాక్స్' యివ్వండి అని వేసుకొంటారు. అలాంటిది గంటసేపు తడిబట్టలతో, తడి తలతో..... అవును-ఇక మిమ్మల్ని ఏవీ ఏమీ చెయ్యలేవు. మౌనంగానే గురువుగారితో మాట్లాడుతూ కూర్చున్నాను. ప్రదక్షిణలు చెయ్యడానికి రమ్మని పిలిచారు. బాసరలో తపస్సుకు వెళ్లి తిరిగి వచ్చినరోజు వారికి చేసిన ప్రదక్షిణ నమస్కారాలు గుర్తు వచ్చాయి. ఇవే కడపటి ప్రదక్షిణలా.... అయ్యో! వారి పాదాలు తాకే భాగ్యం ఇంతటితో సరా!

పూలమాలలతో పల్లకి సిద్ధమైంది. గురుదేవులను అందులో ఆసీనులను చేసారు. పువ్వులు చల్లుతూ భక్తులంతా వెంట నడువగా వారు ఆశ్రమం వీధులు తిరిగి వచ్చారు. మెల్లగా జ్ఞానధామం దగ్గరకు చేరుకున్నారు. అర్క పత్రాలు పరిచిన గోతిలోనికి వారిని మోసుకొని వెళ్లి ఆసీనులను చేసారు. ఉప్పు, విభూతి బస్తాలకొద్దీ క్రుమ్మరించారు.

పుష్పహారాలు, వేదమంత్రాలు, ఏవేవో క్రియలు.... రాము అన్ని పనులూ నిర్వహిస్తున్నాడుగానీ, కన్నులు వర్షిస్తున్నాయి. చివరికి కొబ్బరికాయ కొట్టమంటే మాత్రం "నా వల్ల కాదు" అని బావురుమన్నాడు. ఆప్తశిష్యులంతా తలో గుప్పెడూ మట్టి చల్లి నమస్కరించారు. ఎందుకో అప్రయత్నంగా మనసులో మెదిలింది-"హే గురునాథ, స్థిరోభవ, వరదోభవ, సుప్రసన్నోభవ!" మనకు తెలిసిన ఏ యతీశ్వరుని చరిత్ర చూచినా-వారు ఉన్నప్పటికంటే వారు తమ శక్తిని ఆ తావున నిక్షిప్తం చేసి వెళ్లిపోయాకనే ఆ క్షేత్రం సుప్రసిద్ధమవుతుంటుంది. తాము సశరీరులుగా ఉండి సాధించలేకపోయిన వాటిని కూడా వారు తమ శక్తితో ఆ తరువాత నిర్వహించేందుకే గురుదేవులిక్కడ నిలిచిపోయారేమో!

ఆ పని పూర్తయిన వెంటనే శేషాద్రిశర్మగారు ఒక ప్రకటన మైక్‌లో చేసారు-'యతీశ్వరులు ముందు ఆత్మత్యాగం చేసి తరువాత దేహత్యాగం చేస్తారు. వారి శరీరాన్ని శవమని భావించకూడదు. ఇది శవమనీ, తాకినందుకు స్నానం చేయాలనీ అనుకొంటే పాపాన పోయినవాళ్లమవుతాం. అందరూ కూడా కొద్ది నీళ్లచుక్కలు తలపై చల్లుకొని స్వామికి నమస్కరించి భోజనం చేసి వెళ్లండి" అని.

నిన్నా, యివ్వేళా కూడా నాయర్‌గారు నడుం కట్టుకున్నారు. బావురుమని ఏడుస్తూనే "వచ్చిన వాళ్లను ఉత్తి చేతులతో పంపవద్దమ్మా! నేను చూచుకుంటాను అదంతా" అన్నారు. తన మనుష్యులను తెచ్చుకున్నారు. తొలినాడు వెయ్యి మందికీ, మలినాడు 1800 మందికీ స్వయంగా వండి వడ్డించారు. అందరూ వెళ్లిపోయేసరికి రాత్రి అయింది. శూన్యం యింకా ఎక్కువైనట్లనిపించింది. గురువుగారి గది-సింహం ఖాళీ చేసిన గుహలాగా, దేవు(డులేని గుడి లాగా.... అప్పడేడ్చారు పెద్దపిల్లలంతా. ఎక్కడో జోరాహట్(అస్సాం) నుండీ రెండు విమానాలు మారి, ఇద్దరు పసిబిడ్డలతో రాత్రి తొమ్మిదింటికి వచ్చిన ఆశ్రమం ఆడబడుచు సాయిదివ్యను చూచి యింకా ఏడ్చారు. కడపటి చూపైనా దక్కనందుకు అదీ ఏడ్చింది.





✡ ✡ ✡ ✡ ✡

పెద్దాపురం అప్పలరాజు సిమెంట్ విగ్రహాలు, ఆలయ శిల్పాలు చేస్తుంటాడు. సత్తెనపల్లి సాయిదేవాలయానికి శిల్పం తీర్చినవాడు అతడే. అతనికి ఫోన్ చేసాము గురుదేవులు మనను వదిలివెళ్లిపోయారు బాబూ! వారి విగ్రహం ఒకటి చేసిపెట్టు వచ్చి" అని. అతడు మరునాటి రాత్రే బయలుదేరి వచ్చాడు. రెండు రోజుల శ్రమ తరువాత గురుదేవుల విగ్రహం తయారు చేసాడు. అది క్యూరింగయ్యాకగానీ రంగులు వెయ్యడానికి కుదరదు. అంచేత దాచి ఉంచేసారు- రాంబాబు దీక్షలో ఉన్నాడు. గురుదేవుల జ్ఞానధామం దగ్గర ఉభయసంధ్యలలో దీపారాధన, ఏకభుక్తం, ధ్యానం, ఆషాఢ శుద్ధ దశమి వచ్చింది. అతని జనకమాత (మూడు నెలలుగా కోమాలో ఉన్నది) కన్నుమూసింది. పదిరోజుల క్రితం గురువుగారు రాంబాబుతో "ఆమె (రామలక్ష్మమ్మ) త్వరలోనే వెళ్లిపోతుంది. నీవు బాబా గారికి దత్తుడివి గనుక కర్మకాండతో నీకు పనిలేదు. కానీ, ఆ కడుపున పుట్టినందుకు కొంతైనా ఋణం తీర్చుకోవాలి. కనుక కర్మ ఖర్చు ఆశ్రమం నుంచీ పెట్టు" అని చెప్పి ఉన్నారు. అందుచేత రాంబాబు వెళ్లి దూరం నుంచే నమస్కరించి గురువుగారు చెప్పినట్లు చేసి వచ్చాడు.

రోజులు గడుస్తున్నాయి. తెల్లవారుజామున లేవగానే గురువుగారు గదిలో లేరన్నది గుర్తురాగానే అందరికీ దుఃఖం. జ్ఞానధామం దగ్గర యిరు సంధ్యలలోనూ భజనలు, పూజ, ఒక్కోసారి సత్సంగం, గురునిర్యాణం సకాలంలో తెలియని భక్తుల రాకపోకలు, పలకరింపులు ..... గురుపూర్ణిమ వచ్చింది. "దేవాలయంలో ఏ ఉత్సవాలు ఆగనక్కర్లేదు. యతిశక్తి ఇక్కడే ఉంటుంది. గురుపాదుకలకు పూజ చెయ్యండి" అని విజ్ఞుల ఆదేశం. ఆ మేరకే ఉత్సవం జరిగింది. పేరుకు ఉత్సవమేగానీ ఉత్సాహమెక్కడ? ఎనిమిది

వందలకు పైగా వచ్చిన వారందరి మనసుల్లోనూ మెదిలేది ఒకే మాట-గురుదేవులు లేకపోవటం ఏమిటి? అనే.

16వ రోజున గోదావరి జిల్లా పాలమూరులో గురుదేవుల పేరిట పాదుకా పూజ, సాధు సన్మానం, అన్నదానం, విష్ణుసహస్ర నామం, భగవద్గీతా పారాయణ చేసుకున్నారు. గురుపూర్ణిమనాడు బలభద్రపురం దేవాలయంలో (స్థానిక ఎం.ఎల్.ఏ) గురుదేవుల అభిమాని శ్రీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు గురు పాదుకాపూజ నిర్వహించారు. గురుదేవులు విగ్రహ ప్రతిష్ఠ చేసిన దేవాలయాలు (వార్త తెలిసిన వారందరూ) వారి నిర్యాణ దినాన మూసి ఉంచారనీ, భక్తులకు వార్త తెలియజేసారనీ కబుర్లు వచ్చాయి. అనేక గ్రామాలలో సత్సంగ సమావేశాలు ఏర్పాటు చేసి, వారిని స్మరించుకొని నమస్కరించుకొన్నారని ఫోన్‌లు వచ్చాయి. గురుదేవుల ప్రోత్సాహంతో జంటనగరాలలో ప్రారంభించబడిన సత్సంగ శాఖలలో కూడా గురుసంస్మరణ సమావేశాలు జరిగాయి.

ఆగస్టు 31వ తేదీన మండలారాధన జరుగుతుంది గురుదేవుల పేరిట. అందుచేత పరిసర గ్రామాలలోను, అనేక యితరచోట్ల కూడా 17వ తేదీ నుండి భజనలు, నామ సంకీర్తనలు ప్రారంభమయ్యాయి. గురువారంనాడు (20వ తేదీన) సాయినాథ చరితామృతం పారాయణ కూడా కలుపుకొన్నారు. 27వ తేదీ నాటికి ఆ (పదకొండు రోజులు) ఏకాదశదిన దీక్ష పూర్తి చేసుకొని, ఆయా గ్రామాలలో గురుదేవుల చిత్రపటం, బాబావారి చిత్రపటంతోపాటు సంకీర్తనలతో ఊరేగించి ప్రసాదాలు పంచారు. 28వ తేదీ వరలక్ష్మీ వ్రతం. డెబ్బై మంది ముత్తైదువలతో ద్వారవతిలో జరిగింది. 29న సాయినాథ వ్రతం జరిగింది.

29వ రాత్రి నుండీ దూరతీరాల నుండీ ఆప్తులంతా రాసాగారు. 30వ తేదీకల్లా గురుదేవుల సమాధికి పైన ఆచ్ఛాదన, చుట్టూ మంచి వేదిక నిర్మాణమయ్యాయి. దానికి చేరువలోనే పెద్దవేదిక ఏర్పాటైంది.





సాయిధామం ఆర్చిదగ్గర ఇరవై అడుగుల ఎత్తున గురుదేవులు నిలబడి అందరినీ చిరునవ్వుతో చూడసాగారు. ఈసారి కూడా చి॥ హేమంతరెడ్డి రెండు, మూడు రోజుల సమయాన్ని వెచ్చించి కరపత్రాలు, గోడ పత్రికలు, ఫ్లెక్సీలు అన్నీ ఏర్పాటయ్యేలా చూచాడు. పూర్వ విద్యార్థులు కొందరు, ఆటో రమేష్, మా పాఠశాల ఉపాధ్యాయులు, ప్రేమ్‌కుమార్, హరికృష్ణ, గోపీ మొదలైన వారంతా శారీరకమైన అలసటను లెక్క చేయ కుండా కష్టపడ్డారు. ఆ రాత్రే నెల్లూరు నుంచీ శ్రీశ్రీశ్రీ మాతా అనంతానంద గిరి స్వామిని వేంచేసారు. రేపల్లె నుండీ ఇరవై మంది భక్తులు కూడా వచ్చారు. తెనాలి నుండీ భారతమ్మగారు తమ కంటిచూపు బాగా యిబ్బంది పెడుతున్నా లెక్కచేయకుండా వచ్చేసారు-"నాకీ భాగ్యం ఇంకెన్నడు కలగాలి!" అని. క్షేత్రం దగ్గర నుండీ శారదక్కయ్య నడవలేని స్థితిలో ఉండి కూడా "నా గురువుకన్నా నా బాధ ఎక్కువా?" అని వచ్చేసింది. చివరికి క్షేత్రం ఆశ్రమం ప్రక్కనే కాలవకట్ట మీద గుడిసె వేసుకొని పందులను మేపుకొనే సామ్రాజ్యం "అట్టాంటి దయగల సామి దొరకుతారామ్మా! సమాధికి దణ్ణం పెట్టుకుంటా"నని వచ్చింది. వాళ్లందరినీ చూస్తున్నకొద్దీ నాలో దుఃఖం సుడులు తిరుగుతోంది. "ఇట్లా నాలుగు మూలల వారూ ఒకేసారి వస్తే గురుదేవులెంత సంతోషించి ఉండేవారు ఆయనుంటే!"-అని బాధ కలుగు తోంది. "చూడండి గురువుగారూ! వాళ్లొచ్చారు, వీళ్లొచ్చారు-చూడండి" వెర్రిదానిలా నాలో నేనే అనుకొంటున్నాను.

పుష్పాలంకరణలు-షామియానాలు-ప్రాంగణమంతా శుభ్రం చెయ్యడాలు-లైటింగ్ ఏర్పాట్లు..... ఏమిటివన్నీ? స్వరంలేని వేణువుల్లాగా, తావి లేని పువ్వుల్లాగా, ఆత్మలేని తనువుల్లాగా-సారహీనంగా ...... తెల్లవారింది. నాకు కాళ్లు, చేతులు చచ్చుబడిపోయినట్లుంది. ఝాన్సీ, ఇందిర, పద్మజ చుట్టూ ఎంతమంది ఉన్నా ఒంటరిదాన్నే అన్న భావన-ఏదో వెలితి-..... నాయర్‌గారు క్రితం సాయంత్రం నుండే రంగంలోకి దిగిపోయారు. "ఈ

మాత్రం చెయ్యలేకపోతే ఇంక నేనుండి ఎందుకమ్మా!" అని కన్నీటి పర్యంతమైపోయి మరీ వంటల బరువంతా మీద వేసుకున్నారు. "గురుదేవులకు ఇష్టమైనవే చేద్దాం" అంటూ పూరీ, ఉప్మా టిఫిన్లు తయారుచేసారు. అందరికీ అన్నీ అందేలా చూచే బాధ్యత కొందరు తీసుకున్నారు. మాధవశర్మ తన బృందంతో వచ్చి గురుదేవుల సమాధిపై శివలింగాన్ని ఉంచి రుద్ర సూక్తంతో పూజా కార్యక్రమం శాస్త్రోక్తంగా, నిర్దుష్టంగా నిర్వహించాడు.

శ్రీశ్రీశ్రీ మాతా నిర్మల యోగభారతిగారు తమ బృందంతో విచ్చేసారు. జ్ఞానధామానికి చేరువలో యజ్ఞం ప్రారంభం చేసారు. అంతకన్నా ముందరే ధర్మధ్వజావిష్కరణ చేసి, పరమపూజ్య గురుదేవుల విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పమాలాలంకృతుని చేసారు. యజ్ఞంలో ప్రతి మంత్రం ఎందుకు చెప్తున్నారో, దాని అర్థం ఏమిటో వివరిస్తూ, ఆహూతుల మనస్సులను యజ్ఞంలో భాగస్వాములను చేస్తూ ముచ్చటగా నిర్వహించారు మాతాజీ బృందం. సాధుజనులంతా ఆహుతులు సమర్పించిన తరువాత హారతిచ్చి ముగించారు. అటుపైన స్వామీజీలను సమంత్రకంగా ఆహ్వానిస్తూ వేదిక మీదికి ఆహ్వానించారు కార్యకర్తలు, ఆరాధన నిర్వాహకులున్నూ.

ఏర్పేడు వ్యాసాశ్రమాధిపతులు రాజమండ్రిలో పుష్కర సందర్భంగా చాతుర్మాస్యదీక్షలో ఉన్న పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ పరిపూర్ణానందగిరిగారు తమ అంతేవాసులైన పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ అసంగానందగిరిస్వామివారిని, శ్రీశ్రీశ్రీ పరమాత్మానందగిరి స్వామివారిని పంపించారు తమ ప్రతినిధులుగా. రామకృష్ణ మఠం నుండి పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ రఘునాయకానంద స్వామివారు తమ సాన్నిధ్యంతో సభకు వన్నె తెచ్చారు. సచ్చిదానంద యోగాశ్రమాధిపతులు, చిరకాలంగా గురుదేవులతో అనుబంధం ఉన్న ప॥పూ॥శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలయోగ భారతి స్వామిని వారు సభనలంకరించారు. దాదాపు నలభై ఏళ్లుగా గురుదేవులతో ఆప్తత ఉన్న పరమపూజ్య శ్రీశ్రీశ్రీ చిత్స్వరూపానంద(చిన్మయా మిషన్) స్వామిని





వారు సభకొక కాంతి తెచ్చారు. నెల్లూరు దత్తాశ్రమం నుండీ పరమపూజ్య శ్రీశ్రీశ్రీ అనంతానందగిరి స్వామిని ఎంతో అభిమానంతో వేంచేసి సభను అలంకరించారు. ఆర్ష విద్యా పీఠాధిపతులు ప॥పూ॥ శ్రీశ్రీశ్రీ ప్రణవాత్మానంద సరస్వతీ స్వామివారు తమ సాన్నిధ్యాన్ని సభకు అనుగ్రహించారు. చిరకాలంగా గురుదేవులకు సుపరిచితులు ప॥పూ॥ శ్రీశ్రీశ్రీ స్వామీ జ్ఞానేశ్వరానందవారు సభను అనుగ్రహించారు. నిజామాబాద్ జిల్లా తడపాకల నుండీ శ్రీశ్రీశ్రీ సచ్చిదానందగిరి స్వామివారు, సిరికొండ నుండీ శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యానందపురివారు సభాస్థలికి తమ సాన్నిధ్యాన్ని అనుగ్రహించారు. గురుదేవుల పట్ల అఖండమైన ప్రేమ కలిగిన పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ దివ్యజ్ఞానానంద స్వామివారు సభనలంకరించారు.

తమకు గురుదేవుల పట్ల ఉన్న ప్రేమాదరాలు, గౌరవభావాలతో విచ్చేసిన పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ పరబ్రహ్మానందగిరిస్వామివారు (కరీం నగర్), శ్రీశ్రీశ్రీ శాంతానందస్వామివారు (కామారెడ్డి), శ్రీశ్రీశ్రీ అవధూత రామకృష్ణానందస్వామివారు (బండారుపల్లె), శ్రీశ్రీశ్రీ బాలయ్యస్వామివారు (నిజామాబాద్), శ్రీశ్రీశ్రీ ఆనంద సరస్వతీస్వామి వారు (గోదావరి జిల్లా) మరపల్లి, శ్రీ సత్యనారాయణ శర్మగారు (పాండురంగాశ్రమం, మరుకుక్కు) (ఇంకా హడావుడిలో పేర్లు వ్రాసుకోలేకపోయిన వారు కూడా ఉంటే వారు క్షమించాలి నా వృద్ధాప్యాన్ని) మొదలైన స్వామీజీలు కూడా సభనలంకరించారు.

ఒక్కసారి సభముందు నిలబడగానే నాకు కంఠం పెగిలిరాలేదు. సభలో శ్రీ వి.వి.కృష్ణారావుగారు, ప్రభావతి, దేవానందరెడ్డి, కె.కృష్ణారావుగారు, లక్ష్మణరావుగారు, గుమిడెల్లి విజయకుమార్‌గారి సోదరులు, ధర్మారెడ్డిగారు, సోమన్న, సుగుణ, ఎన్నెస్ రెడ్డిగారు, రేవతి, ఎం.వి.ఆర్.శాస్త్రిగారు, ఎందరెందరో .... గురుదేవులు ఎంతగా ప్రేమించారు వీరందరినీ! సత్యంజీ, మాణిక్యాచారిగారు, కేశవరాజుగారు, లక్ష్మీశేఖర్‌గారు, సత్యనారాయణ

గారు.....గురుదేవులు ఎంత అభిమానించారు వీరందరినీ! నారాయణరావు గారి నిస్వార్థ సేవ గురించీ, చురుకుదనం గురించీ ఎంత చెప్పేవారు! ఆనాటి దృశ్యాలు, గురుదేవుల మాటలు పదేపదే నా కళ్లను మసకబారుస్తున్నాయి. నాకు శక్తినిమ్మని వారినే ప్రార్థించుకొని, ఆశ్రమం గురించీ, గురుదేవులను గూర్చి నాకు తెలిసిన నాలుగు మాటలు సభకు, స్వామీజీలకు చెప్పకొన్నాను. అటుపైన మాధవశర్మ మంత్రోచ్చారణ చేస్తుండగా ఒక్కొక్క స్వామి వారికి ఒక్కొక్కరుగా పూజా కార్యక్రమం నిర్వహించి, వస్త్రాలు, ఛత్రాలు వగైరా కానుకలు, దక్షిణలు సమర్పించుకొన్నారు. నాకు దాదాపు మూడేళ్ల క్రితం సాయిధామంలో జరిగిన సాధు సమ్మేళనం, అందుకోసం గురువుగారు పడిన శ్రమ, వారి ఉపన్యాసం గుర్తు వస్తున్నాయి. సాధువులందరినీ దేశ సేవ, సమాజసేవలవైపు కార్యోన్ముఖులను చేయాలన్న తపనతో వారు శ్రీశైలం అడవులంతా పర్యటించిన విషయం గుర్తు వస్తోంది. దుఃఖమూ వస్తోంది.

సాధు సన్మానానంతరం శ్రీ మాతా నిర్మలయోగ భారతిగారు మాట్లాడుతూ ధర్మాన్ని, దేశాన్ని రక్షించుకోవటం ప్రతి హిందువుకూ కర్తవ్యమనీ, విధర్మశక్తులు చెలరేగుతున్న తరుణంలో కేవలం ఆశ్రమాలకూ, స్వీయోన్నతికే పరిమితం కావటం తగని పని అనీ, గురుదేవులు దీన్ని సాధించటం కోసం ఎంతో తపించారనీ అన్నారు. మనిషి ఎలా జీవించాలో తెలుసుకొని జీవిస్తే ధర్మం నిలుస్తుందన్నారు. శ్రీ మాతా చిత్స్వరూపానంద వారు తాము గురుదేవుల ప్రోత్సాహంతోనే మొదట విశ్వహిందూ పరిషత్ కార్యక్రమాలలో అడుగుపెట్టామనీ, క్రమంగా ఆధ్యాత్మిక రంగంలో ముందుకు వెళ్లి సన్యసించామనీ చెప్పారు. ఎలాంటి పరిస్థితులలోనైనా వారి ముఖంలో కోపమూ, ఆందోళనా కన్పించేవి కావనీ, చిరునవ్వు చెదిరేది కాదనీ, ఆ గొంతు పెరిగేది కాదనీ, అటువంటి స్థితప్రజ్ఞత అపూర్వమనీ అన్నారు. శ్రీ రఘునాయకానంద స్వామివారు మాట్లాడుతూ ఒక పసిబాలుడి మీదుగా రథం పోయినందుకు ఎంతో ఆగ్రహావిష్టులైన





స్థానికులు తమ మీదకు డబ్బు విసరబడగానే అన్నీ మరచి అవి ఏరుకోవటంలో నిమగ్నమైపోయారనీ, అటువంటి దశలో ఉన్న సమాజాన్ని సేవించడానికీ, మార్చడానికీ కూడా ఎంతో కృషి, త్యాగం అవసరమనీ, అలాంటి రంగంలో ఉన్న వారికి భగవద్రక్ష ఉంటుందనీ సెలవిచ్చారు. అటుపైన శ్రీ అసంగానంద స్వామివారు భారత భాగవతాలలో నుండీ ఎన్నో ధార్మిక విషయాలను సోదాహరణంగా వివరించారు. శ్రీ గడ్డం నరసింహారెడ్డిగారు గురుదేవులకు శ్రద్ధాంజలి సమర్పించుకున్నారు. అప్పటికే పన్నెండు గంటలైంది.

గురుదేవులతో చివరిసారిగా ధార్మిక విషయాలు చర్చించినది శ్రీ ఎం.వి.ఆర్. శాస్త్రి (ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకులు)గారు-అని నేను అంతకుపూర్వమే చెప్పి ఉండటంచేత ఆ మాటలేవో శ్రీ ఎం.వి.ఆర్.శాస్త్రిగారి నోటనే వినాలని కొందరు కోరటంతో వారు ఆ విషయాలన్నీ వివరించారు. సనాతన దేశ ధర్మాన్ని రక్షించటం అన్నది ఉపన్యాసాల ద్వారానో, నగరాలలో ర్యాలీల ద్వారానో జరగదనీ, గ్రామ గ్రామానా యువ కార్యకర్తలను పోగుచేసుకొని, తగిన శిక్షణనిచ్చి, చిన్న చిన్న గ్రామ సమావేశాల ద్వారా హిందూత్వ లక్షణాలు, ధర్మాలు ప్రచారం చేయించాలనుకొన్నామన్నారు. సాయిధామం కేంద్రంగా ఒక దళాన్ని తయారుచేయడానికి గురుదేవులు సంసిద్ధులైనారని వివరించారు శ్రీ శాస్త్రిగారు. తరువాత .......

గురుదేవులు సాయి భజనలు, సంకీర్తనలకన్నా తత్త్వాన్ని ప్రేమించేవారు. సాయి సచ్చరిత్రలో కేవలం సాయినాథులవారు చెప్పిన మాటలనే వేరుగా వ్రాసారు. దాన్ని ఒక చిన్న పుస్తకంగా “శ్రీ సాయి ఉపదేశ రత్నమాల” అనే పేరిట అచ్చు వేయించాము. అలాగే గురుదేవులు తమ డైరీలో ఒకచోట “సాయి చాలీసా, దండకం అందరికీ అందాలి” అని వ్రాసుకున్నారు. వారి గురువు (మా పరమగురువులు)గారు వ్రాసిన దండకాన్ని కూడా అచ్చు వేయించాము. (చాలీసా మూడుసార్లు వేయించాం యిప్పటికే.) వాటిని అందరికీ పంచారు కార్యకర్తలు. తదుపరి చి॥ రాంబాబు(రాము)కు ఆశ్రమ

ఉత్తరదాయత్వం యిస్తూ గురుదేవులు చెప్పిన విషయాన్ని పదిమంది ముందూ చెప్పటం అవసరమనీ, ఆ పని చెయ్యమనీ పెద్దలు కొందరు సూచించారు. మాధవశర్మ మంత్రాలు చెప్తుండగా రాము సాధువులకు, పెద్దలకు నమస్కారాలు చేసి ఆశీస్సులు అందుకొన్నాడు. అటుపైన శ్రీ చింతలపాటి మూర్తి గారు గురుదేవులకెంతో ప్రియమైన స్నేహదీపాలు వెలిగిస్తూ సాగిపోతున్న స్వరాంజలి పాట ఆలపించారు.

తరువాత శ్రీ డా॥ బాబూరావుగారు గురువుగారు ప్రకృతి వైద్యశాల కోసం ఎంత ఆరాటపడ్డారో సభకు చెప్పారు. ఆ వైద్యపు విలువను గురించి వివరంగా, చక్కని ఉదాహరణలతో వివరించారు-కరెంట్ పోయిన ఖంగుమన్న కంచుకంఠంతో .

ముందు సాధువులు చేయి కడక్కుండా మిగిలిన వారికి వడ్డించ రాదని శాస్త్రం. అందుచేత సాధుజనులందరినీ ఉష భవనం దగ్గరకు తీసుకువచ్చాము. వడ్డనల బాధ్యత శ్రీమతి ఇందిర, శ్రీమతి కమల గారలకు అప్పగించాము. గీత వారికి తోడుగా ఉన్నది. అందరూ సంతృప్తిగా భోజనాలు చేసారు. రవ్వంత నూనె అయినా పీల్చుకోని గారెలు, కారం ఎక్కువలేని కూరలు, అతి తీపిలేని పాయసం, అచ్చం గురువుగారు ఎలా ఉంటే యిష్టపడతారో అలాంటి సాంబారు .... నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది-సరిగ్గా గురువుగారు ఎలా యిష్టపడతారో అన్నీ అలాగే ఎలా కుదిరాయి? అంతలోనే అనుకొన్నాను-'వండినవారు గురువుగారిని ఎంతో అభిమానించిన వారే. కనుక యిలాకాక మరోలా ఎలా అవుతుంది!' అని. భోజనాలు అయిపోయాయి.

ఎం.వి.ఆర్.శాస్త్రిగారు సాధుజనులందరినీ వరండాలో సమావేశపరిచారు. గురువుగారి సందేశాన్ని మరోసారి గుర్తుచేసారు. ఏక్షన్ ఆఫ్ ప్లాన్-కార్యాచరణరీతిని రూపొందించుకోవాలన్నారు. కొందరు స్వామీజీలు, స్వామినులు కూడా తమతమ అభిప్రాయాలు చెప్పారు. మరోసారి కలుసుకొని విస్పష్టమైన కార్యప్రణాళిక రూపొందించుకోవాలని





నిర్ణయించుకొని విడిపోయారు. చావడి ముందరా, కళ్యాణిలోనూ చాలా ప్రణాళికాబద్ధంగా నీట్‌గా అందరికీ భోజనాలు అందించారు. చి॥ ప్రవీణ్ (కీసర), నరేశ్, సాయిభరత్, నరసింహ, సంజీవ్, హేమంత్, రమేశ్ తదితర యువ కార్యకర్తలంతా కలిసి. అందరూ తినగా మిగిలిన వాటిని పేదసాదల కాలనీలతో పంచి వచ్చారు కూడా. భక్తులందరూ భోజనాలు చేసి వెళ్లిపోతూ అలవాటుగా 'ఉష' దగ్గరకు వచ్చారు. వీడ్కోళ్లు చెప్తున్నారు. మాకు ధైర్యం చెప్తున్నారు. నాలో మళ్లీ శూన్యం ఏర్పడుతోంది. "వీళ్లంతా వచ్చినపని అయిపోయింది. ఇక ఎవరిళ్లకు వారు వెళ్లిపోతారు. ఎప్పుడో గుర్తు వచ్చినపుడు "ఎలా ఉందో ఆశ్రమం!" అనుకొంటారు. బాగా తీరినప్పుడు అలా ఓసారి వచ్చి వెడతారు. అప్పుడప్పుడూ ఫోన్ చేస్తారు. ఇక యీ గురుశూన్య ఆశ్రమంలో నేను-పిల్లలు-వృద్ధులూ....." అంతలోనే స్ఫురణకు వచ్చింది-గురుసేవ అంటే అసలైనది భావసేవ గదా! గురువుగారు భౌతికంగా లేనంతమాత్రాన వీళ్లంతా వారి భావాలనెలా మరచిపోతారు? ఎవరో కొద్దిమంది ప్రక్కకు తిరుగుతారేమోగానీ యిన్నాళ్లుగా గురువుగారి ప్రేమను రుచిచూచిన వారు వారి కలల పంటా, కార్యక్షేత్రానికి కేంద్రమూ అయిన ఆశ్రమాన్ని ఎలా వదిలిపెడతారు? ధైర్యం కలిగింది.

మరునాటి ఉదయం పదిగంటలయ్యేటప్పటికి భక్తులంతా వెళ్లిపోగా-యిక మిగిలింది మేము! పై కార్యక్రమానికి ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా సహకరించిన మునునూరి రామమోహనరావుగారు, రవీంద్రరెడ్డిగారు, నాయర్‌గారు, గుమిడెల్లి విజయకుమార్‌గారు, ఇంకా ఎందరెందరికో నేనెందుకు కృతజ్ఞతలు చెప్పాలి? వాళ్ల గురువుగారికి వారు చేసుకున్నారు-అనుకొన్నాగానీ తోడై నిలచినందుకు చెప్పాలిగదా! కొందరు హార్దికంగా, కొందరు శారీరకంగా, కొందరు ఆత్మీయంగా ఎందరెందరో సహకరించారు. వారందరికీ ఆశ్రమ ధర్మాధికారిగా కృతజ్ఞతలు తెలియ జేసుకొంటున్నాను.

గురువుగారెక్కడో ప్రోగ్రాంకి వెళ్లారు. ప్రొద్దున్నేనో, రాత్రికో వచ్చేస్తారు-

అన్నట్లే అనిపిస్తుంటుంది' అంటారు పెద్దపిల్లలు. 'బాబాగారు ఎన్నో రూపాలలో వస్తుంటారన్నావు కదమ్మా! అలాగే గురువుగారు కూడా ఎన్నో రూపాలలో వచ్చి మనను చూచి వెడుతూనే ఉంటారు. మనం గుర్తు పట్టలేకపోయినా ఆయన గుర్తుపడతారు గదా!' అంటుంది చైత్ర. బాగా బెంగపడినప్పుడు మాత్రం జ్ఞానధామం దగ్గరకు వెళ్లి వస్తారు. ఇంకా మాకెవ్వరికీ కూడా వారు లేరన్న సత్యం జీర్ణం కావటం లేదు.

ప్రియ మిత్రులారా, గురుదేవులు లేని లోటు ఎవ్వరూ పూడ్చగలిగేది కాదు. కానీ, మాకు కలిగిన (మనకు కలిగిన) యీ ఆఘాతం నుండి కోలుకొనేందుకు, గురుదేవుల లక్ష్యాలు నెరవేర్చేందుకు ఒకరికొకరం తోడుగా ఉందాం. ఇదే మా కోరిక. సెలవ్. మరో శీర్షిక చదివే ముందర - ఒక్క ఐదు నిముషాల పాటు కనులు మూసుకునే గురుదేవులను స్మరించుకొని ముందుకు కదలండి.

# మాతృసంస్థ కబుర్లు

సెప్టెంబరు ఒకటవ తేదీన గురుదేవుల మండలారాధన తాలూకు ఎకౌంట్లు జమ చేయటం, సామాన్లు సర్దటం, పిల్లలంతా అలసిపోయిన కాళ్లు, చేతులు సరిచేసుకోవటం, నిన్న రాలేనివారు పలకరించడానికి రాగా వారితో మాట్లాడటం-వీటితో సరిపోయింది. 2వ తేదీ ఉదయం పిల్లలను రైలు ఎక్కించి రాము, మాతాజీ, ఆనందంగారు, మంజుల కార్లో బయలుదేరారు. మధ్యాహ్నానికి సత్తెనపల్లి చేరుకొన్నారు. గత ఏడాది ఆగస్టు 15న (ఆషాఢ శుద్ధ సప్తమి) సాయిబాబా వారి ప్రతిష్ఠ జరిగింది ఆనంద సాయి ప్రభు మందిరంలో. కనీసం తొలి వార్షికోత్సవంనాటి వరకైనా ఉండకుండా గురుదేవులు తరలిపోయారు. కనీసం మేమైనా వెళ్లకపోతే అక్కడి భక్తులు చిన్నబుచ్చుకొంటారన్న బాధతో వెళ్లటమేగానీ ఎవ్వరికీ





ఉత్సాహం లేదు - చిన్నపిల్లలకు తప్ప.

దిగి లోపలికి వెడుతూంటేనే గురుదేవుల గదిలోని శూన్యం వెంటాడింది. కొంతసేపు దుఃఖపడినా ప్రక్కల ఉన్న భక్తులు రావటంతో త్వరగానే తేరుకొన్నాము. అన్నపర్రు నుంచీ భజన సమాజం వారు వచ్చారు. వారే నడుంకట్టి వంటలు చెయ్యడానికి కూడా సిద్ధమైపోయారు. గ్రామీణులు ఉత్సాహంతో పూనుకొని తలోపనీ అందుకొన్నారు. రాత్రి అయింది. ఝూన్సీ పూలతోసహా వచ్చింది. ఇక దండలు గుచ్చే పని ప్రారంభ మైంది. "సత్తెనపల్లి ఆశ్రమం మేం కూడా చూస్తామని మా వెంట వచ్చిన చిరంజీవినులు (సాయి విద్యాధామం 10వ తరగతి పిల్లలు) సంధ్య, దివ్య, సుస్మిత, భాగ్యలక్ష్మి కూడా ఉత్సాహంతో పనిలో దిగారు మా పిల్లలతోపాటు. ఏ అర్ధరాత్రికో నిద్రపోయారు.

తెల్లవారింది. రాత్రి కురిసిన వానకు తడిసిన షామియానా స్థానంలో క్రొత్తది వచ్చింది. స్నానాలు అవీ పూర్తయ్యేసరికి ఫెళ్లున ఎండ వచ్చింది. తడినేల కాస్తా పొడిబారసాగింది. హుజూర్‌నగర్ మిత్రులు శ్రీ పూర వెంకయ్యగారు, వారి శ్రీమతి ఇందిర, వారి కుమార్తె, అల్లుడు కూడా వచ్చారు ఉత్సవానికి. క్రిందటి రాత్రే వారు చేయించి పంపిన ఉత్సవ (పంచలోహ) విగ్రహానికి శోభాయాత్ర జరిగింది. పూజ కోసం కూడా చిన్న విగ్రహం ఒకటి తెచ్చారు వారు. శ్రీ ఈదర సాంబశివరావుగారు చేయించి పంపిన సింహాసనం బాబా వారికి సమర్పించాడు రాంబాబు - అభిషేకాదుల తరువాత ప్రథమ పూజ పూర్తయింది. అల్పాహారం తరువాత ఆలయ అలంకరణ చేసారు ఝూన్సీ, పిల్లలూ కలిసి. మెల్లమెల్లగా భక్తులు చూస్తూ చూస్తుండగానే గుడి నిండిపోయింది. సామూహిక పూజకై కనకాంబరాలు రాసులుగా ఉన్నాయి. పదిన్నర ప్రాంతాల సహస్ర నామార్చన

ప్రారంభమైంది. రాము చదువుతుండగా దోసిళ్లతో శ్రీ సాయినాథుల శిరస్సు మీదుగా జారుతూ వారి పాదాల మీద నిలిచేలా పూలు పోస్తున్నాడు ప్రేంకుమార్. బుట్టలతో పూలు అందిస్తున్నారు కార్యకర్తలు. కొంతసేపటికి మాతాజీ అందుకొన్నారు నామం చెప్పటం. రాము, ప్రేమ్‌కుమార్ చెరోవైపునా పూలదోసిళ్లతో జలకమాడించారు సాయిదేవులను. గురుదేవులు చిదానందంగా శిరస్సున ఒక పద్మం ధరించి మరీ చూస్తూ కూర్చున్నారు పటంలోంచే.

చూడముచ్చటగా ఎరుపు, తెలుపు, కనకాంబరం రంగులు కలిసి చక్కగా జరిగింది పూజ. ఆ తరువాత గురుదేవులను గూర్చి కొద్దిగా మాట్లాడాము. మహాహారతి వేళయింది అంతలో. హారతి ముగించుకొని వెళ్లే వారందరికీ పుష్పప్రసాదం, గురుదేవుల మండలారాధన ప్రసాదం, దండకం కూడా యిచ్చాము. అటుపైన భక్తులందరూ మాత్రమేకాక పేద సాదలు కూడా వచ్చి సాయి ప్రసాదం ఆరగించారు. మొత్తం 2,500 మంది భోజనాలు చేసారు. తరువాత ఊళ్ల నుండీ వచ్చిన వాళ్లంతా వెళ్లిపోగా మిగిలిన వాళ్లం ఆశ్రమ భవిష్యత్తును, ప్రస్తుత స్థితిని చర్చించుకొంటూ కూర్చున్నాం. పిల్లలను తీసుకొని వెళ్లి రాము పణిదం సొసైటీ మరమగ్గాలను, నేసే విధానాన్నీ చూపించాడు. సాయంత్రానికి గీత భారతిని శారదా నికేతన్‌లో దించి, అలాగే తన పాత గురువులందరి దర్శనం చేసుకు వస్తానని గుంటూరు వెళ్లింది. బ్రహ్మారెడ్డి సుధను తెనాలి కాలేజ్‌లో దింప డానికి వెళ్లాడు. మరునాటి ఉదయం లేవగానే అందరం ప్రయాణానికి సిద్ధమయ్యాము.

ముందురోజు తెల్లవార్లూ బొంగరంలా తిరుగుతూ తన సహకారం అందించిన వీరాస్వామికీ, అనేక రీతుల సహకరించిన శ్రీయుతులు





డా॥ అమరేంద్రగారికీ, శ్రీ మడిపాలపు నాగేశ్వర్రావుగారికీ, శ్రీ పోలంకి ప్రసాద్ గారికీ యింకా తమ సేవాహస్తాన్ని చాపిన ప్రతి ఒక్కరికీ, ఎక్కడి నుంచో వచ్చి అద్భుతమైన సహకారం అందించిన భజన సమాజం వారికీ, చక్కగా ఓర్పుగా అన్ని కార్యక్రమాలూ నిర్వహించిన ప్రేమ్‌కుమార్‌కూ శ్రీ సాయి ఆశీస్సులు అందాలని మనసారా ప్రార్థించాము.

ఆగస్టు 29వ తేదీన శ్రీ రామకోటేశ్వర్రావుగారికి పౌత్రోదయమైంది. అప్పటికాయన హైదరాబాదుకు వచ్చి ఒక్కరోజే అయింది. ఈ కబురు వినగానే తిరిగి క్షేత్రానికి పరుగెత్తారు. ఆయన కొడుకు సాయిరమణే అక్కడ పూజారి. అతను పది, పదకొండు రోజులు గుడిలో పూజలు చేయకూడదు గదా! అంచేత అక్కడి స్థానిక శివాలయ పూజారి లింగమూర్తిగారిని బ్రతిమాలి పురుడు వెళ్లేవరకూ సాయి దేవాలయంలో కూడా పూజ చేసేలాగా ఒప్పించి తిరిగి 30వ తేదీ తెల్లవారే సరికి సాయిధామానికి వచ్చేసాడు రామకోటేశ్వర్రావు. “పిల్లవాడెలా ఉన్నాడు?” అని అడిగితే “నేనింకా చూడలేదు. అయినా నా యింటికి వచ్చినవాడు ఎవరను కొంటున్నావు? “సాయి ప్రభుజీ” “బ్రహ్మాండంగా ఉంటాడు” అన్నాడు. అలా గురుదేవుల పేరు పెట్టుకొన్న తొలి శిశువు క్షేత్రంలో వెలిసాడు.

సాయిధామం బాలబాలికలకు ఉత్సవాలు లేవు గనుక యీ యేడు వినాయకుళ్లు (పిల్లలవి) బారులు తీరలేదు. అందరూ గుడిలో జరిగే పూజనే చూచి నమస్కారం చేసుకున్నారు. సాయినాథ క్షేత్రంలో కూడా వినాయక పూజ జరిగింది గ్రామీణ భక్తుల సమక్షంలో.

సాయి సన్నిధానంలో ప్రేమ్‌కుమార్‌గారు పంచముఖ గణపతిని తయారుచేసి, ముచ్చటగా అలంకరించి పూజించారు. భక్తులకు ప్రసాదాలు పంచారు.

ఓం శ్రీ సాయిరాం



# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

17-02-1912

నేను ప్రొద్దున లేచి ప్రార్థించుకొన్నాను. ఉపాసనీశాస్త్రి, కళ్యాణ్ నుంచి వచ్చిన కుంటేశాస్త్రి, మోర్గావ్‌కర్ నేను కలిసి పంచదశి క్లాసు పెట్టుకున్నాం. ఇవ్వేళ మూడో అధ్యాయం పూర్తిచేశాం. బాబా బయటికి వెళ్లడం తిరిగిరావటం చూశాం. ఆయన చాలా సరదా మూడ్‌లో ఉన్నారు. జోక్‌లు వేస్తున్నారు. మధ్యాహ్నహారతి మామూలుగానే జరిగింది. తర్వాత భోజనం. మిస్టర్ దీక్షిత్, తన కొడుకు ఉపనయనానికి నాగపూర్ వెల్దామను కుంటున్నాడు. అతనికి తనతోపాటు ఇక్కడి నుండి ఎంతమందిని వీలయితే అంతమందినీ తీసుకువెళ్లాలనుంది కాని ప్రతిదీ సాయి అనుమతి మీద ఆధారపడి ఉంటుంది. సాయంత్రం దీక్షిత్ రామాయణం తర్వాత మా పరమామృతం క్లాసు బాగా చురుగ్గా నడిచింది. సాయిమహరాజ్‌ను నడక సమయంలో దర్శించుకున్నాము. వాడా హారతి తర్వాత శేజారతి అయ్యింది. శేజారతి సమయంలో ఓ పెద్ద విసనకర్ర వచ్చింది నాకు. నేను తిరిగి వచ్చాక భీమాజీ కుంటే శాస్త్రి సంకీర్తనం చేసాడు. ఆయన ఉత్తరగోగ్రహణం చెప్పాడు. ఎనభై ఏళ్ళ ఆ వృద్ధుడిలో ఓర్పు, శక్తి అన్నీ కూడా మెచ్చదగినట్లుగా ఉన్నాయి. తర్వాత దీక్షిత్ రామాయణం, భీష్మ భాగవతం చదివారు.

18-02-1912

మాధవరావు దేశ్‌పాండే లేపితే లేచి ప్రార్థన చేసుకొని కాకడహారతికి వెళ్లాను.





సాయిసాహెబ్ చాలా ప్రశాంతంగా ఉన్నారు. మామూలుగా కఠినంగా మాట్లాడినా తక్కువ స్థాయి లోనే. దీక్షిత్ తన కొడుకు ఉపనయనానికి నాగపూర్ వెళ్లాలను కొంటున్నాడు. ఆయన సాయిబాబాతో నన్ను కూడా తీసుకు వెళతానని అడిగాడు. బాబా సందిగ్ధంగా జవాబిచ్చారు. నాకు అనుమతి దొరకదనే గట్టి నమ్మకం. మా ఆవిడకు వెళ్లాలని చాలా ఆతురతగా ఉంది. నేను ఉపాసనీ, బాపూసాహెబ్ తదితరులతో పంచదశి క్లాసులో ఉండగా నానాసాహెబ్ చందోర్కర్ వచ్చాడు. దీక్షిత్ దగ్గరున్నాడు. క్లాసు తరువాత నేను సాయిసాహెబ్ దగ్గరికి వెళ్లినపుడు ఆయనను కలిసాను. సాయి ఆయనతో మామూలుగానే నూనెవాడు, వామన్ తాత్యా, అప్పాకోటే వగైరాల గురించి తమ మామూలు ధోరణిలోనే మాట్లాడుతున్నారు. మధ్యాహ్నహారతి మామూలుగానే నడిచింది. చివరిలో మాత్రం బాబా కొద్దిగా కోపించి అందరినీ త్వరగా వెళ్లిపొమ్మన్నారు. దీక్షిత్, నేనూ, నానాసాహెబ్ కలిసి భోంచేసాము. ఇంతకుముందు తను వచ్చి ఉన్నపుడు మా మధ్య జరుగుతూ మధ్యలో ఆగిపోయిన సంభాషణను కొనసాగించమని నానాసాహెబ్‌ను అడిగాను. ఆయన విషయం సాయిబాబా చేతుల్లో ఉన్నదన్నాడు. ఆయన తనతో ఒక కృత్రిమమైన తోటను, దానిలో పెద్ద చంద్రుడినీ, మనం పెళ్లిళ్లలో వాటిలో చూచేలాంటి దానిని తెచ్చాడు. అది తెమ్మని రాధా కృష్ణమాయి ఆర్డరిచ్చిందట. నేను కాస్సేపు పడుకొన్నాను. తరువాత నాలుగు గంటల ప్రాంతంలో నానాసాహెబ్ వెళ్లిపోయాడు. అటుపైన దీక్షితు రామాయణం చదివాడు. ఆ తర్వాత మేము పరమామృతం చదువుకొన్న తరువాత సాయిబాబాను సాయంత్రపు నడకలో కలుసుకున్నాము. రాత్రి చంద్రుడిని వెలిగించారు. చాలా అద్భుతమైన కాంతి వచ్చింది. నా భార్య అమరావతి వెళ్లటం గురించి సాయిసాహెబ్‌ను అడిగితే సందిగ్ధపు జవాబే వచ్చింది. వాడా హారతి తరువాత దీక్షితు రామాయణం, భీష్మ భజన జరిగాయి.

దీక్షితు, మాధవరావు దేశ్‌పాండే రేపు వేకువనే ఊరికి వెళ్లటానికి ఏర్పాట్లు చేసుకోవటం కోసం త్వరగా ముగించాం భజన.

19-02-1912

దీక్షిత్, అతని భార్య, మాధవరావు, హీరాలాల్ యింకా యితరులూ ప్రొద్దున్నే వెళ్లిపోయారు. దీక్షిత్ కుటుంబం తమ కొడుకు ఉపనయనానికి నాగపూర్ వెడితే - మాధవరావు తన మిత్రుడింట్లో అలాటి ఉత్సవానికే హార్దా వెళ్లాడు. ప్రార్థన తరువాత పంచదశి క్లాసు నడిచింది. మోర్ గావ్‌కర్ తన గొలుసు, గడియారం పోయినాయన్నాడు. అవి రెండూ బంగారపువీ, చాలా విలువైనవీను. వెదికారు గానీ దొరకలేదు. సాయిబాబా బయటికి వెళ్లటం, తిరిగి రావటం కూడా చూచాము. మధ్యాహ్నహారతి మామూలుగా నడిచింది. ఒకటికి బదులు రెండు చామరాలు వచ్చాయివ్వేళ. బాలాసాహెబ్ పూజ చేసుకొన్నాక, హారతికి కూడా ఉందామనుకున్నాడు గానీ బాబా ఆయనను వెళ్లిపొమ్మన్నారు. భోజనానంతరం కాస్సేపు పడుకొని లేచాక పంచదశి క్లాసు మా మామూలు సభ్యులతో నడిచింది. కొంతసేపటి తర్వాత దాదాకేల్కర్, బాలాషింపీ తదితరులు వచ్చారు. సాయి మహరాజును సాయంత్రం వాహ్యాళి వేళ దర్శించుకొన్నాము. వాడా ఆరతి తరువాత శేజారతికి వెళ్లాము. కృత్రిమ తోటలు, చందమామ మొదటిసారి ఉపయోగించబడినపుడు చాలా అందంగా ఉండి ఓ పెద్ద గుంపును ఆకర్షించాయి. సాయి సాహెబ్‌కు అవి నచ్చనట్లేమీ లేదు. చందమామ (సహాయ కంగా)నే పనికివచ్చేట్లుగానే ఉందన్పించింది నాకు. భీష్మ భాగవతం, దాసబోధలో పది సమాసాలు చదివాడు. నటేకర్ అలియాస్-హంస నేను యీ నెలాఖరుకు అమరావతికి రావలసి ఉందని నాకు ఉత్తరం వ్రాసాడు.

**(సశేషం)**







# హే పాండురంగ !

- పరమ గురువులు స్వర్గీయ శ్రీ చిల్లర మాణిక్యారావుగారు

12.రామకోటిని గొందఱు వ్రాయుచుండ
నిల్చినీ మూర్తి మిక్కిలి నెనరు తోడ
పూజసేతును భక్తి సద్బుద్ధి యమర
భక్త హృదయాంతరంగ శ్రీ పాండురంగ!

13. శక్తి లేదాయెనేదైన సలుప నాకు
శరణు వేడుచునుంటి నీ చరణములకు
నన్నుగానంగ నీ కంటె నున్నదెవరు
భక్త హృదయాంతరంగ శ్రీ పాండురంగ!

14. లేదు నాకు ధారా శుద్ధి లేశమైన
పాండితీగరిమయును లేకుండె సుమ్ము,
ఎటుల శతకముచే నుతియింప నేర్తు
భక్త హృదయాంతరంగ శ్రీ పాండురంగ!

15. శృతి పురాణేతిహాసాల తతినెరుంగ,
లేదు ఆధ్యాత్మ చింతన లేశమైన,
గొలుతు నిను మూఢభక్తితో గోమరు మిగుల
భక్త హృదయాంతరంగ శ్రీ పాండురంగ!

16. క్షేత్రములు తీర్థ రాజముల్ చెలగి భరత
ఖండ మందుననెన్నియోయుండ వాని
బోయి దర్శింపనాజ్ఞ నాకీయవేల
భక్త హృదయాంతరంగ శ్రీ పాండురంగ!

17. ఒక్క పరి కలలోనైన, చక్కగాను
తావకీయ సాకారంపు దర్శనంబు
నీయవైతివి యెటు తోచదాయె నాకు
భక్త హృదయాంతరంగ శ్రీ పాండురంగ!

# జ్ఞానధామం

పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి మహాభినిష్క్రమణం తరువాత ఆ చోట ఒక ధ్యానమందిరం నిర్మాణం కావాలని శ్రీ సాయినాథుల వారు ఒక సంకల్పాన్ని ప్రసాదించారు. 50 × 30 అడుగులలో ఒక మందిరాన్ని నిర్మాణం చేసి, కేవలం ధ్యానం చేసుకొనే సాధకుల కోసమే దానిని ఒక నిశ్శబ్ద సాధనా మందిరంగా తీర్చిదిద్దాలన్నది ఆదేశం. దీనిలో గురుదేవుల పాలరాతి విగ్రహం కూడా ప్రతిష్ఠించుకోవాలన్నది ఉపసంకల్పం. విజయదశమినాడు యీ జ్ఞానధామం పేరిటి ధ్యానమందిరానికి శంకుస్థాపన చేయాలని నిర్ణయం జరిగింది.


ప్రియ మిత్రులారా, ఈ నిర్మాణానికి సహకరించదలచిన వారెవరైనా ధన, వస్తు రూపాలలో ఎలాగైనా ముందుకు రావచ్చు. 80జి రాయితీతో రసీదులు అందుతాయి. గురుదేవుల విగ్రహం మందిరం పూర్తి అయ్యే నాటికి రావాలంటే ఇప్పుడే ఆర్డరివ్వవలసి ఉంటుంది. సాయిధామం అభిమానులు, గురుదేవుల పట్ల భక్తి, ప్రేమాభిమానాలు గలవారు ఎవరు ఏ విధంగా ముందుకు వచ్చినా సాయిధామం సాదరంగా ఆహ్వానం పలుకుతుంది.

ఫోన్స్ : 9440413455
9848133565

ధర్మాధికారి,
సాయిధామం.







# శ్రీ గజానన విజయం

- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

## 10వ అధ్యాయము (కొనసాగింపు)

బాలాపూర్‌లో శుకలాల్ అగర్వాల్ అనే ఆయన ఉండేవారు. ఆయన దగ్గర ఒక పోట్ల ఆవు ఉండేది. అది పిల్లలను, ఆడవాళ్లను కొమ్ములతో ఎత్తిపడేసి కుమ్మి గాయపరుస్తూ ఉండేది. దుకాణాల్లోకి చొరబడి కూరగాయలూ, ధాన్యం అన్నీ తినేసేది. నూనె, నెయ్యిలాంటివన్నీ ఒలకబోసేది. సుఖ్‌లాల్ దాన్ని అదుపులో ఉంచలేకపోయేవాడు. తాళ్లే కాదు- గొలుసులు కూడా తెంచిపారేసేది. కట్టడమూ, పాలివ్వడమూ లేనే లేవు. “దాన్ని ఏ కసాయివాడికో అమ్మెయ్యి-లేకపోతే చంపైనా పారెయ్యి” అని ఊళ్లో వాళ్లంతా అనేవారు. ఒకసారి ఒక ప్రధాన్ దాన్ని కాల్చి వెయ్యడానికి ప్రయత్నిస్తే అది తిరగబడి అతన్నే తీవ్రంగా పొడిచింది. సుఖ్‌లాల్ దాన్ని ఎక్కడో దూరప్రాంతంలో విడిచిపెట్టి వస్తే మళ్లీ వెంటనే తిరిగి వచ్చేసింది. ఊళ్లో వాళ్లు సుఖ్‌లాల్‌కు దాన్ని షేగాఁవ్ తీసుకువెళ్ల మనీ, గజాననులు గోవింద బువా గుర్రాన్ని ఎలా మచ్చిక చేసారో దీన్ని కూడా అలా చేస్తారనీ చెప్పారు. అయితే - ఆ పోట్ల ఆవును షేగాఁవ్ దాకా తీసుకువెళ్లటం అన్నది పెద్ద సమస్య. అందుచేత దానికి ప్రత్తి గింజలు, దాణా వంటివి ఆశచూపి, ఇనుప గొలుసులతో బంధించారు. ఒక బండి మీద ఎక్కించి షేగాఁవ్ తీసుకువెళ్లారు.

షేగాఁవ్ సమీపిస్తుండగానే ఆవులో మార్పు కనిపించింది. వారు మహరాజ్‌ను సమీపించేసరికి దాని కనుల నుండీ నీరు ధారాపాతంగా కురువసాగింది. దాన్ని అలా హింసించి బంధించి తెచ్చినందుకు స్వామి

కోప్పడ్డారు సుఖ్‌లాల్‌ను. "క్రూరమైన పులిని చూచినట్లు చూస్తారా గోవును?" అన్నారు. దాన్ని వెంటనే విప్పమనీ, అది ఎవరినీ పొడవదనీ చెప్పారు. దాన్ని విప్పే ధైర్యం ఎవ్వరూ చెయ్యకపోతే-వారే స్వయంగా విప్పారు. గోవు ముందరికాళ్లు వంచి మహరాజ్ ముందు మోకరించింది. తరువాత పైకి లేచి వారి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేసింది. చూస్తున్నవారు చకితులైనారు. గజాననులు ఆవునుద్దేశించి, "బంగారు తల్లీ, ఇంక ఈ చోటు వదిలివెళ్లకు. ఎవ్వర్నీ పొడవకు" అన్నారు. అందరూ 'మహరాజ్‌కూ జై!' అని జయజయధ్వానాలు చేసారు. ఆవును మఠంలోనే వదిలి గ్రామీణులంతా వెనుదిరిగారు. ఆ తరువాత ఆ గోవును త్రాటితో కట్టిందే లేదు. పైగా అది చాలా ఈతలు ఈనింది. దాని సంతతి యింకా షేగాఁవ్‌లో ఉన్నది.

కరంజాకు చెందిన లక్ష్మణ్ ఘడే బాగా సంపన్నుడు. ఆయనకేదో అంతు తెలియని జబ్బు చేసింది. దానికి మందులూ లేవు. ఆయన గజాననులను గూర్చి విని షేగాఁవ్ వచ్చాడు. రావడం అంటే తనంత తానుగా రాలేదు. బాగా బలహీనంగా ఉండటంచేత డోలీలో మోసుకు వచ్చారు. అతని భార్య మహరాజ్‌కు నమస్కరించి, "నేను నీ బిడ్డను స్వామీ! నేను నిన్ను ఆశ్రయించి ఉండగా నా భర్త ఎందుకు మరణించాలో చెప్పు" అన్నది. గజాననులు అప్పటికి తాము తింటున్న మామిడిపండులో మిగిలిన భాగాన్ని ఆమె మీదికి విసిరి, "నీ భర్తకు అది తినిపించు. నీవు సరైన యిల్లాలివి. అంచేత నీ భర్తను నీకిస్తున్నాను" అన్నారు. అటుపైన ఆయన చిలుం పీల్చసాగారు. ఆమె భర్తతో కరంజా తిరిగి వెళ్లింది. స్వామి ఇచ్చిన పండు భర్తకు తినిపించింది. ఈ విషయం తెలిసి, వైద్యుడు మామిడిపండు వ్యాధిని పెంచుతుందని కోప్పడ్డాడు. శుశ్రుతుడు, మాధవనిదానం మొదలైన అన్నింటిలోనూ అలాగే ఉందన్నాడు. అది ప్రసాదమైతే ఆవిడ తినవలసిందిగానీ, అతనికి పెట్టటం తప్పన్నారు. చుట్టాలంతా ఆ మాటలు





బలపరిచారు. కానీ, పండు మాత్రం సత్ఫలితాన్నే ఇచ్చింది. రాతిలా కఠినమై పోయిన వ్యాధిగ్రస్తుడి పొట్ట మెత్తబడి జబ్బు తగ్గిపోయింది. శక్తి కూడా వచ్చింది. వైద్యం మనకు కొంతవరకే పనికివస్తుంది. అది విఫలమైనచోట కూడా సాధు కృప అద్భుతంగా పనిచేస్తుంది.

లక్ష్మణ్‌ఘడే షేగాఁవ్‌కు వచ్చి మహరాజ్‌ను తన యింటికి రావలసిందిగా ప్రార్థించాడు. స్వామి అంగీకరించి, శంకర్‌భావు పీతాంబర్‌ను వెంటబెట్టుకొని కరంజా వచ్చారు. లక్ష్మణ్ 'యిదంతా తమదే స్వామీ!' అంటూనే ఒక పళ్లెంలో కొన్ని వెండి నాణేలు ఉంచి సమర్పించుకొన్నాడు. మహరాజు అతన్ని తిట్టారు. "అన్నీ నావేనన్నావు. మరికొద్దిగా నాణేలిస్తావేం? ఈ కపట నాటకం విడిచిపెట్టు. నీవు నీ యింటిని నాకిచ్చావు. తాళాలు, తాళం చెవులు అన్నీ విసిరెయ్యి" అన్నారు. లక్ష్మణ్ మౌనంగా కూర్చున్నాడు. మహరాజు "ముందు నీ ఇనుప బీరువా తెరువు" అని పట్టుబట్టారు. లక్ష్మణ్ తటపటాయిస్తూనే తెరిచాడు బీరువా తలుపు. కానీ గడప మీదే కూర్చున్నాడు. గజాననులకు అతని ఆడంబర బుద్ధి అర్థమైంది. వారికి ధనం అక్కరలేదు. లక్ష్మణ్‌ను పరీక్షించదలచారంతే! అతడు తన మాటకు కట్టుబడే నిజాయితీపరుడు కాడు. ఎంతో ఇద్దామనుకొన్నాను. కానీ, అతనికి అందుకొనే యోగ్యత లేదు. అతని కపటానికి ఫలితం అతన్నే అనుభవించనీ" అన్నారు.

మహరాజుల మాట అక్షరాలా నిజమైంది. ఆరు నెలలలోనే లక్ష్మణ్ సంపదంతా పోయింది. అతడు నిరుపేద అయిపోయాడు. అందుచేత పాఠకులందరూ గుర్తుంచుకోండి. ఆధ్యాత్మికరంగంలో నటన పనికిరాదు. నిజాయితీ ఉండాలి. ఈ విషయాన్ని పదుగురికీ తెలపడానికే గజాననులు యీ ఘట్టమంతటినీ కల్పించారు. వారు కోరికలు తీర్చగల చింతామణి. ఓ గులకరాయి ఆ అందాన్ని పెంచగలదా? బంగారాన్ని అలంకరించడానికి ఎవరైనా తగరాన్ని ఉపయోగిస్తారా? మహరాజుల యీ లీల ద్వారా పాఠకులు గొప్ప ప్రయోజనాన్ని పొందుదురు గాక!

**(సశేషం)**

# సంస్మరణిక

మిత్రులారా,

గురుదేవుల పేరిట ఒక సంస్మరణిక తేవాలని ఒక సంకల్పం కలిగింది. మీకు వారితో పరిచయం, అనుబంధం, అనుభవాలు, మీకు కలిగిన మేళ్లు వగైరాలను అక్షరబద్ధం చేసి పంపితే-వాటిని సంస్మరణికలో చేరుస్తాము. సాయివాణిలోనైనా ప్రచురిస్తాము. అచ్చులో రెండు పేజీలు (ఎ4 సైజులో 3 వ్రాత పేజీలు) మించకుండా ఉండేలాగున వ్రాసి పంపగలరు. రచనలు సాయివాణి చిరునామాకు నవంబరు 15వ తేదీ లోపల చేరేలాగా పంపగలరు లేదా 'E-mail : saidhamam.ram@gmail.com, saidhamam.seva @ gmail.com' అన్న ఈ-మెయిల్‌కు కూడా పంపవచ్చు.

**- ప్రధాన సంపాదకులు,**
**సాయివాణి**